ఊపిరి ఆడక ఉక్కిరిబిక్కిరి
- పెరుగుతున్న న్యుమోనియా కేసులు
- గద్వాల జిల్లాలో ఈ ఏడాది 190 కేసులు
- చలిలో ఎక్కువగా బాధించే వ్యాధి

7

యోగా టోర్నీలో పతకాలు సాధించాలి
- ఎస్‌జీఎఫ్ సెక్రెటరీ శారదాబాయి
- ఉత్సాహంగా ఉమ్మడి జిల్లా యోగా జట్ల ఎంపిక

పొగచూరుతున్న మధ్యాహ్న భోజనం

చరిత్రలో తొలిసారి

- ఒకే ఏడాది ఏడు సార్లు తెరుచుకున్న సరళా సాగర్ ప్రాజెక్టు సైఫన్లు
- 66 ఏళ్లలో ఇదే తొలిసారి



ఆటోమెటిక్ సైఫన్లు తెరుచుకోవడంతో విడుదల అవుతున్న నీరు

వనపర్తి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): వనపర్తి జిల్లా మదనాపూర్ మండలంలో ఉన్న సరళాసాగర్ ప్రాజెక్టు 66 ఏళ్ల చరిత్రలో ఈ ఏడాది రికార్డు సృష్టించింది. ప్రాజెక్టు నిర్మాణం పూర్తయిన నాటి నుంచి ఇప్పటి వరకు 66 ఏళ్లలో ఒకే ఏడాది తొలిసారి ఏడుసార్లు అత్యధికంగా సైఫన్లు తెరుచుకొని దిగువకు నీరు ప్రవహించడం రికార్డు బ్రేక్‌గా చెప్పవచ్చు. సంస్థానాధీశుల కాలంలో సైఫన్ సిస్టంతో నిర్మించిన ఈ ప్రాజెక్టు ఆసియా ఖండంలోనే మొదటిదిగా ప్రపంచంలో రెండోదిగా పేరు గాంచింది. వనపర్తి సంస్థానాన్ని పరిపాలించిన రాణి సరళాదేవి జ్ఞాపకార్థం రాజారామేశ్వరరావు రూ. 35 లక్షల వ్యయంతో 1947 జూలై 10వ తేదీన ప్రాజెక్టు పనులు ప్రారంభించి 1959 లో పూర్తి చేసి అందుబాటులోకి తీసుకొచ్చారు. ఈ ఏడాది భారీ వర్షాలు కురిసిన నేపథ్యంలో ప్రాజెక్టు చరిత్రలో ఎప్పుడూ లేని విధంగా ఒక్క ఏడాదిలో సైఫన్లు 7 సార్లు తెరుచుకోవడం ఇదే తొలిసారి.

ప్రాజెక్టు తొలి నాళ్ల నుంచి

ప్రాజెక్టు నిర్మాణం పూర్తయ్యాక 1960లో మొదటిసారి సైఫన్లు తెరుచుకున్నాయి. ఆ తరువాత భారీ వర్షాలు కురవడంతో 1961, 1962, 1963 వరకు వరుసగా సైఫన్లు ఓపెన్ అయ్యాయి. 1964లో భారీ వర్షాలు పడటంతో శంకర సముద్రం ఆనకట్టకు గండిపడి సరళా సాగర్ ప్రాజెక్టులోకి భారీగా వరద నీరు చేరడంతో ఆనకట్ట తెగిపోయింది. ఆ తరువాత ఆనకట్టకు మరమ్మతులు చేపట్టాక మళ్లీ 1967, 1970, 1974, 1981, 1988, 1990, 1991, 1993, 1998, 2009లో కురిసిన వర్షాలకు ప్రాజెక్టుకు భారీగా వరద నీరు చేరి సైఫన్లు ఓపెన్ అయ్యాయి. 2019 డిసెంబరు 31న కురిసిన భారీ వర్షాలకు ప్రాజెక్టుకు భారీగా వరద నీరు చేరి సైఫన్లు తెరుచుకునే సమయంలో ప్రాజెక్టు ఎడమ పక్కన ఉన్న ఆనకట్ట తెగిపోయింది. మళ్లీ ప్రభుత్వం మరమ్మతులు చేపట్టి సాగునీరు అందించారు. అనంతరం తిరిగి 2021, 2022, 2023, 2024లలో కురిసిన వర్షాలకు సైఫన్లు ఓపెన్ అయ్యాయి.

ఈ ఏడాది ప్రాజెక్టు చరిత్రలో తొలిసారి

ప్రాజెక్టు కట్టినప్పటి నుంచి గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈ ఏడాది వర్షాకాలంలో ఆటోమెటిక్ సైఫన్లు పైనుంచి వచ్చిన వరద దాటికి 7 సార్లు తెరుచుకున్నాయి. 1959లో ప్రాజెక్టు పూర్తయినప్పటి నుంచి ఒక ఏడాది వర్షాకాలంలో అత్యధిక సార్లు సైఫన్లు తెరుచుకోవడం ఇదే తొలిసారి అని సంబంధిత అధికారులు చెబుతున్నారు. ఈ ఏడాది ఆగస్టు 13 నుంచి 31వ తేదీ వరకు 18 రోజుల పాటు సైఫన్లు తెరుచుకొని గరిష్ఠంగా 14,760 క్యూసెక్కుల నుంచి 500 క్యూసెక్కుల వరకు దిగువకు పారాయి. అదేవిధంగా సెప్టెంబరు 1 నుంచి 7వ తేదీ వరకు తిరిగి 11వ తేదీ నుంచి 18వ తేదీ వరకు, 22వ తేదీ నుంచి 29వ తేదీ వరకు 11320 క్యూసెక్కుల నుంచి 500 క్యూసెక్కుల వరకు నీరు దిగువకు పారింది. అలాగే అక్టోబరు 10 నుంచి 16వ తేదీ వరకు 24, మళ్లీ 25వ తేదీలో 7380 క్యూసెక్కుల నుంచి 500 క్యూసెక్కుల వరకు ప్రాజెక్టు నుంచి దిగువకు నీరు పారినట్లు ఇంజనీరు అధికారి ప్రమోద్ తెలిపారు.

ధాన్యం డబ్బులు వెంటనే చెల్లించాలి

పెద్దమందడి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ధాన్యం విక్రయించిన రైతుల ఖాతాలలో సకాలంలో డబ్బులు జమ చేసేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన వనపర్తి జిల్లా పెద్దమందడి మండలంలోని వెల్టూరులో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రం, మోజర్లలో వారాహి రైస్ మిల్లును పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కొనుగోలు కేంద్రానికి తెచ్చిన ధాన్యాన్ని నిబంధనల ప్రకారం తూకం చేయాలని సూచించారు. ధాన్యం మిల్లింగ్ విధానాన్ని పరిశీలించిన కలెక్టర్ మిల్లింగ్ ఆడించి త్వరగా ఎఫ్‌సీఐకి అప్పగించాలని యజమానిని ఆదేశించారు.



రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్ ఆదర్శ్ సురభి

పత్తి రైతులు ఇబ్బంది పడొద్దు

- కలెక్టర్ బదావత్ సంతోష్

కల్వకుర్తి, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): పత్తి రైతులకు ఇబ్బంది లేకుండా పత్తి కొనుగోళ్లు జరగాలని కలెక్టర్ బదావత్‌సంతోష్ అన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి మండలం తర్నికల్ సమీపంలోని జిన్నింగ్ మిల్లును మంగళవారం కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పత్తి రైతులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. అదేవిధంగా కల్వకుర్తి వ్యవసాయ మార్కెట్ యార్డులో కొనసాగుతున్న మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేశారు. కలెక్టర్ వెంట కల్వకుర్తి తహసీల్దార్ ఇబ్రహీం, జిన్నింగ్ మిల్లు అధికారులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ బదావత్ సంతోష్

రికార్డు స్థాయిలో.. వరద



నిండుకుండలా ఉన్న జూరాల ప్రాజెక్టు

కృష్ణా బేసిన్ ప్రాజెక్టులకు ఇంకా కొనసాగుతోంది..

- వరద సమయంలోనే వానాకాలం పంట చేతికి..
- యాసంగిలో వారబందీ వద్దంటున్న ఆయకట్టు రైతులు
- సమర్థవంతంగా వినియోగిస్తే.. తాగు, సాగునీటికి ధోకా లేనట్లే..

మహబూబ్‌నగర్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): దిగువ కృష్ణా బేసిన్‌కు వరద ఇంకా వస్తూనే ఉంది. ఈ బేసిన్‌కు సాధారంగా జూన్ చివరి వారం నుంచి వరద ప్రారంభమై.. సెప్టెంబరు వరకు ఈ ప్రాంతాల్లో కురిసే వర్షాలతో కొనసాగుతుంది. ఎప్పుడో ఒక సంవత్సరం అక్టోబరులో కూడా స్వల్పంగా వరద వస్తుంది. వరద ఆగిపోయే సమయానికి వానాకాలం పంటలు రాష్ట్రంలో కోత దశలో ఉంటాయి. కానీ ఈ ఏడాది మే మూడో వారంలో ప్రారంభమైన వర్షాలు, వరద నవంబరు రెండో వారం గడుస్తున్నా కొనసాగుతున్నాయి. ఓ వైపు చలి ప్రారంభమైనా వరద మాత్రం ఆగడం లేదు. ఎగువన కర్ణాటకలో రోడ్ కం బ్యారేజీలు కట్టినప్పటి నుంచి కనీసం సీపేజ్ కింద కూడా చుక్క నీరు జూరాల వరకు రాని పరిస్థితుల్లో ఏటా వేసవిలో తాగునీటి అవసరాల కోసం కర్ణాటక ప్రభుత్వాన్ని కోరాల్సిన దుస్థితి నెలకొంది. గడిచిన రెండేళ్లుగా ఇదే పరిస్థితి ఉండగా, ఈ ఏడాది సమర్థవంతంగా నీటి వినియోగం చేస్తే వేసవి తాగునీటి అవసరాలకు నారాయణపూర్ రిజర్వాయర్‌పై ఆధారపడాల్సిన అవసరం ఉండదని, ఆయకట్టు సాగునీటికి కూడా ఇబ్బందులు ఉండవనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

నీళ్లొచ్చినా నిష్ఫలం..

దిగువ కృష్ణా బేసిన్‌లో తెలంగాణలో వచ్చే మొదటి ప్రాజెక్టు జూరాల. ఆ తర్వాత శ్రీశైలం, నాగార్జునసాగర్‌లతో తెలంగాణ రైతాంగం సాగు, తాగు నీటిని పొందుతోంది. కృష్ణా నదికి సాధారణ వరద రోజులు 90 కాగా.. ఈసారి దాదాపు 160 రోజులకుపైగా వరద వచ్చింది. జూరాల, నెట్టెంపాడు, కల్వకుర్తి, భీమా 1, 2, కోయిల్ సాగర్ ఎత్తిపోతలకు సంబంధించిన రిజర్వాయర్లు నిండుకుండల్లా ఉన్నాయి. చెరువులు స్థానికంగా కురిసిన వర్షాలకే జలకళను సంతరించుకున్నాయి. అయితే ఈ ఏడాది అనుకున్నంతగా వరద నీటిని లిఫ్ట్ చేసి నిలువ చేసుకోలేని పరిస్థితులు ఉన్నాయి. స్టోరేజీ రిజర్వాయర్లు సరిపడా లేకపోవడమే ఇందుకు కారణంగా చెప్పొచ్చు. వరద వస్తున్న రోజుల్లో లిఫ్టుల్లో మోటార్లను నిలిపివేసుకోవాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. కల్వకుర్తి కింద కేవలం 4 టీఎంల లోపు నిల్వ సామర్థ్యం ఉండటం, భీమా కింద శంకర సముద్రం పూర్తి కాకపోవడం, నెట్టెంపాడు కింద ర్యాలంపాడు రిజర్వాయర్ లీకేజీల కారణంగా 4 టీఎంసీలకు గాను, కేవలం 2 టీఎంసీలు మాత్రమే నిల్వ చేయడం, ప్యాకేజీ 99, 100లు పూర్తి కాకపోవడం వంటి సమస్యలు నెలకొన్నాయి. కోయిల్‌సాగర్ కింద అదనపు ఆయకట్టు స్థిరీకరణ కాకపోవడంతో వచ్చిన నీటిని వచ్చినట్లు దిగువకు వదిలేయాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. వరదలు భారీగా వచ్చి భూగర్భ జలాలు పెరగడంతో కొంత మేలని చెప్పవచ్చు. పలు చోట్ల భూములు జౌకు ఎక్కడంతో ఈ ఏడాది యాసంగి పంటలకు కూడా పెద్దగా ఇబ్బందులు ఉండకపోవడం ఊరట కలిగిస్తోంది.

18 వేల క్యూసెక్కుల వరద

ప్రస్తుతం జూరాలకు 18 వేల క్యూసెక్కుల వరద వస్తోంది. అంటే రోజుకు 1.80 టీఎంసీ నీరు వస్తున్నట్లే. ఈ నెలాఖరు వరకు వరద కొనసాగినా.. ఇప్పటికే వానాకాలం పంటలు చేతికి వచ్చాయి. దాంతో యాసంగికి వారబందీ లేకుండా నిర్దేశించిన డిస్ట్రిబ్యూటరీ వరకు నీరు ఇచ్చినా.. అధిక వర్షాలతో వానాకాలం దిగుబడి నష్టపోయిన తమకు మేలు జరుగుతుందని రైతులు కోరుతున్నారు. ఇరిగేషన్ అడ్వయిజరీ బోర్డు సమావేశానికి ఇంకా సమయం ఉన్నప్పటికీ.. నీటి పొదుపు ఇప్పటి నుంచే అమలు చేయాల్సిన అవసరం ఉంది. కొన్నిచోట్ల ప్రజాప్రతినిధులు తమ దగ్గరకు వచ్చిన వినతులను పరిగణలోకి తీసుకుని, నీరు విడుదల చేయడం వల్ల యాసంగిలో ఇబ్బందులు పడాల్సి వస్తోంది.

మెజారిటీ వరద కడలిపాలు..

ఏపీ వైపు శ్రీశైలం నీటిని చిత్తూరు జిల్లా కుప్పం వరకు తలిస్తుండగా.. తెలంగాణ వైపు కనీసం కల్వకుర్తి ఎత్తిపోతల

(మిగతా 6లో..)



మహాత్మాగాంధీ కల్వకుర్తి ఎత్తిపోతల పథకం

నల్లమలలో ఉద్రిక్తత

- అటవీ భూములను సాగు చేస్తున్న గిరిజన రైతులను అడ్డుకున్న అధికారులు
- అటవీ సెక్షన్, బీట్ ఆఫీసర్‌లపై సాగుదారుల దాడి
- 11 మందిపై కేసు నమోదు



అటవీశాఖ అధికారులపై దాడి చేస్తున్న సాగుదారులు

కొల్లాపూర్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూలు జిల్లా కొల్లాపూర్ వద్ద నల్లమలలో 15 ఎకరాల అటవీ భూమిని సాగు చేస్తున్న వ్యక్తులను అడ్డుకోబోయిన నార్లాపూర్ ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్ జయరాజ్, బీట్ ఆఫీసర్ వాల్యా నాయక్‌లపై దాడి చేసిన ఘటన మంగళవారం చోటుచేసుకున్నది.

కొల్లాపూర్ అటవీ రేంజ్ పరిధిలోని ముక్కిడిగుండం గ్రామం వట్టిమాకుల కుంట ఏరియాలో 15 ఎకరాల్లోని చెట్లను కొట్టి కాలుస్తుండగా విధి నిర్వహణలో ఉన్న అటవీశాఖ అధికారులు జయరాజు, వాల్యా నాయక్ వెళ్లారు. అడవిని అక్రమంగా నరికి వేయడం చట్టరీత్యా నేరమని అక్కడ ఉన్న గిరిజన మహిళలు, వారి భర్తలను మందలించారు. దీంతో అధికారులను చుట్టుముట్టిన గిరిజనులు మూకుమ్మడిగా దాడిచేసి గాయపరిచారు. ఈ విషయం తెలుసుకున్న జిల్లా అటవీ శాఖ అధికారి రోహిత్ గోపిడీ, అచ్చంపేట డివిజనల్ ఆఫీసర్ చంద్రశేఖర్, ఎఫ్ఆర్‌వో ఈశ్వర్ సంఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. సాగుదారులు సాలమ్మ, జ్యోతి, చిన్నమ్మ, బుజ్జి లను అదుపులోకి తీసుకుని కొల్లాపూర్ ఫారెస్టు రేంజ్ కార్యాలయానికి తరలించారు. ఈ సంఘటనలో 11 మందిపై సెక్షన్ ఆఫీసర్ జయరాజ్, బీట్ ఆఫీసర్ వాల్యా నాయక్ కొల్లాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు నిర్వహిస్తున్నట్లు ఎస్ఐ హృషికేష్ తెలిపారు. ఈ సంఘటనను జూనియర్ అటవీ శాఖ అధికారుల అసోసియేషన్ అధ్యక్షులు రవికుమార్, జోనల్ సెక్రటరీ ముజీబ్ గోరి ఖండించారు.

- గీతం యూనివర్సిటీ ప్రొఫెసర్ జేడీ ప్రభాకర్
- ఘనంగా పీడీఎస్‌యూ 4వ జిల్లా మహాసభలు

నిర్వీర్యమవుతున్న ప్రభుత్వ విద్య

6

క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలి : డీవైఎస్‌వో

గద్వాల అర్బన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి):క్రీడాకారులు క్రీడా స్ఫూర్తితో రాణించాలని డీవైఎస్‌వో కృష్ణయ్య అన్నారు. మంగళవారం గద్వాల పట్టణంలోని ఇండోర్ స్టేడియం గ్రౌండ్‌లో 69వ ఎస్‌జీఎఫ్ జిల్లాస్థాయి అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా డీవైఎస్‌వో మాట్లాడుతూ విద్యార్థులకు చదువు ఎంత ముఖ్యమో.. క్రీడలు కూడా అంతేముఖ్యమని సూచించారు. అనంతరం ఎస్‌జీఎఫ్ కార్యదర్శి డాక్టర్ తోట శ్రీనివాసులు మాట్లాడుతూ జిల్లాలోని వివిధ మండలాల నుంచి 800 మంది బాలబాలికలు పోటీలకు హాజరయ్యారని అన్నారు. అండర్-14 విభాగంలో 100, 200, 600 మీటర్ల పరుగు పందెం, లాంగ్‌జంప్, హైజంప్, షాట్‌పుట్, డిస్కస్‌త్రో, జావెలిన్‌త్రో పోటీలను, అండర్-17 విభాగంలో 100, 200, 400,800,1,500, 3 వేల మీటర్ల పరుగు పందెం, లాంగ్ జంప్, హైజంప్, జావెలిన్ త్రో, డిస్కస్‌త్రో జిల్లాస్థాయి ఎంపికలను నిర్వహించామన్నారు. జిల్లాస్థాయిలో ఎంపికైన వారు ఈనెల 12వ తేదీ మహబూబ్‌నగర్‌లో జరిగే జోనల్‌స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.



హైజంప్ చేస్తున్న క్రీడాకారుడు

ప్రకృతి గీసిన చిత్రమా



ప్రకృతి అందాలు ఎంతచూసినా చూడాలనిపిస్తోంది. నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట మండలంలోని చెన్నారం స్టేజీ సమీపంలో మంగళవారం భానుడు అస్తమించే వేళ ఆకాశం నుదుటున బొట్టు పెట్టినట్లు అద్భుతమైన దృశ్యం కనిపించింది. అదే సమయంలో (గడ్డిపూలు) వెండిపూలు వికసించి ప్రకృతి ప్రేమికులను ఆకట్టుకుంటున్నాయి. ఈ సుందర దృశ్యాలను 'ఆంధ్రజ్యోతి' కెమెరా క్లిక్ మనిపించింది.

- అచ్చంపేట, ఆంధ్రజ్యోతి



వీడిన మిస్టరీ

- మహిళ హత్యకేసులో నిందితుడి అరెస్టు
- రూ. 2,33,500 నగదు, స్కూటీ, సెల్‌ఫోన్ స్వాధీనం
- వివరాలను వెల్లడించిన ఎస్పీ శ్రీనివాసరావు



విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడిస్తున్న ఎస్పీ శ్రీనివాసరావు

గద్వాల క్రైం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): గద్వాల పట్టణంలో జరిగిన మహిళ హత్యకేసును పోలీసులు ఎట్టకేలకు ఛేదించారు. ఈ కేసుకు సంబంధించిన పూర్తి వివరాలను మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ శ్రీనివాసరావు వెల్లడించారు. ఈ నెల 2న గద్వాల పట్టణంలోని షేరెల్లి వీధిలో బలిజ లక్ష్మి హత్యకు గురైన విషయం తెలిసిందే. ఆమె భర్త మల్లికార్జున్‌గౌడ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని గాలింపు చర్యలు చేపట్టిన పోలీసులు మంగళవారం గద్వాల మార్కెట్ యార్డులో అనుమానాస్పదంగా తిరుగుతున్న కాళ్ల రామిరెడ్డిని అరెస్టు చేశారు. అతని వద్ద ఉన్న నగదు రూ.2,33,500లతో పాటు స్కూటీ, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకొని విచారిస్తే నేరం అంగీకరించాడు. అతన్ని కోర్టులో హాజరు పరిచి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు తెలిపారు. నిందితుడు రామిరెడ్డి ధరూర్ మండలం గార్లపాడు నుంచి బదుకుదెరువు కోసం గద్వాలకు వచ్చాడు. గద్వాలలో పట్టణంలో బలిజ లక్ష్మి ఉంటున్న భవనం పై అంతస్తులో అద్దెకు దిగాడు. అతను బెట్టింగులలో డబ్బులు పోగొట్టుకొని అప్పుల పాలయ్యాడు. బలిజ లక్ష్మి వడ్డీ వ్యాపారం నడుపుతుండటంతో ఆమె దగ్గర వడ్డీకి డబ్బులు తీసుకొని చేసిన అప్పులను కట్టుకోవాలని నిర్ణయించుకున్నాడు. ఈ నెల 2న ఆమె ఇంటికి వెళ్లి అప్పు అడిగాడు. గతంలో తీసుకున్న అప్పు ఇవ్వకపోవడంతో ఆమె డబ్బులు ఇవ్వడానికి నిరాకరించింది. రామిరెడ్డికి బలిజ లక్ష్మి మెడలోని బంగారు ఆభరణాలపై కన్ను పడింది. ఆ ఆభరణాలను అమ్మితే తన అప్పు తీరిపోతుందని నిర్ణయించుకొని ఆమె గొంతునులిమి హత్యచేసి బంగారు ఆభరణాన్ని దోచుకెళ్లాడు. మరుసటి రోజు హైదరాబాద్‌లోని శంషాబాద్‌లో ఉన్న తన స్నేహితుడైన ఉమేష్‌కు ఆ ఆభరణం తన భార్య నాన్నమ్మది, దీనిని కరిగించి ముద్దగా ఇవ్వాలని కోరాడు. ఆ ముద్దగా ఉన్న బంగారాన్ని హైదరాబాద్‌లోని ఉప్పుగూడలో విక్రయించి రూ. 4.60 లక్షల నగదు తీసుకున్నాడు. ఆ నగదులో కొంత తన ఖర్చులకు వాడుకొని మిగితా కొంత తన భార్యకు చెవి రింగులు, దుస్తులను కొనుగోలు చేశాడు. రూ.1,13,500లను తన స్కూటీలో ఉంచుకొని గద్వాలకు చేరుకున్నాడు. మిగతా డబ్బును హైదరాబాద్‌లో నివసించే ఒక మిత్రుడి వద్ద రూ.20 వేలు, మరో మిత్రుడి వద్ద రూ.1లక్ష దాచుకున్నట్లు తెలపడంతో పోలీసులు హైదరాబాద్ వెళ్లి నగదు తీసుకువచ్చారు. దీంతో నిందితుడు రామిరెడ్డి వద్ద నుంచి మొత్తం రూ. 2,33,500, ఒక స్కూటీ, ఒక ఐఫోన్‌ను స్వాధీనం చేసుకొని కోర్టులో హాజరు పరిచి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు తెలిపారు. కేసును ఛేదించిన పట్టణ ఎస్ఐ కళ్యాణ్‌కుమార్, పట్టణ ఎస్ఐ-2 సతీష్‌రెడ్డి, రూరల్ ఎస్ఐ శ్రీకాంత్, మల్దకల్ ఎస్ఐ నందికర్, ధరూర్ ఎస్ఐ శ్రీహరితో పాటు సిబ్బందిని ఎస్పీ అభినందించి రివార్డులను అందజేశారు.

రైతులను ఇబ్బంది పెట్టొద్దు

» ఆంక్షలు లేకుండా పత్తి కొనుగోలు చేయాలి
» అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు


రైతులు తెచ్చిన పత్తిని సీసీఐ, మిల్లు యజమానికి చూపిస్తున్న ఎమ్మెల్యే విజయుడు

అలంపూరు చౌరస్తా, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : పత్తి కొనుగోలుకు ఆంక్షల పేరుతో రైతులను ఇబ్బంది పెట్టొద్దని అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు అన్నారు. జోగుళాంబ గద్వాల జిల్లా, ఉండవల్లి మండల పరిధిలోని శ్రీ వరసిద్ధి వినాయక కాటన్ మిల్లులో ఏర్పాటు చేసిన సీసీఐ కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. రైతులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. అధిక వర్షాలతో పత్తి పంటలు దెబ్బతిన్నాయని, వచ్చిన అరకొర పత్తిని కూడా నాణ్యత పేరుతో తిప్పి పంపిస్తున్నారని రైతులు వాపోయారు. ప్రభుత్వమే కొనకపోతే ఇంకెవరు కొంటారని ఆవేదన వ్యక్తం చేశారు. స్లాట్‌బుకింగ్ నిమిషంలోనే క్లోజ్ అవుతోందని, దీంతో ఇబ్బంది పడుతున్నామని చెప్పారు. దీంతో సీసీఐ అధికారి రాహుల్‌ను, మిల్లు యాజమాని శ్రీనివాసులును పిలిపించి రైతుల ఎదుటే మాట్లాడారు. పత్తిని ఎందుకు తిరస్కరిస్తున్నారని ప్రశ్నించారు. సీసీఐ నిబంధనల మేరకే రైతులు తెచ్చిన పత్తిని ఎంపిక చేయాల్సి ఉంటుందని ఎమ్మెల్యేకు రాహుల్ వివరించారు. మిల్లు సామర్థ్యం రెండు వేల క్వింటాళ్లు మాత్రమే అని, దీంతో ఓపెన్ చేసిన కొద్దిసేపటికే కోటా పూర్తవుతోందని తెలిపారు. ఎమ్మెల్యే వెంట నాయకులు గజేందర్‌రెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి తదితరులున్నారు.

ఫిల్టర్ ఇసుక తయారీ కేంద్రాల కూల్చివేత

» 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందించిన అధికారులు


ఫిల్టర్ ఇసుక తయారు చేస్తున్న స్థావరాలను ధ్వంసం చేస్తున్న రెవెన్యూ సిబ్బంది

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

మహమ్మదాబాద్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : ఇసుక అక్రమ దందాపై 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి రెవెన్యూ, పోలీసులు స్పందించారు. మహబూబ్‌నగర్ జిల్లా, మహమ్మదాబాద్ మండల పరిధిలోని అన్నారెడ్డిపల్లి, కంచన్‌పల్లి వాగుల సమీపంలో కొందరు ఫిల్టర్ ఇసుకను తయారు చేస్తున్నారు. ఈ విషయంపై 'మళ్లీ మొదలైంది' - యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా' శీర్షికన మంగళవారం కథనం ప్రచురితమైంది. అందుకు స్పందించిన తహసీల్దార్ విద్యాసాగర్‌రెడ్డి సిబ్బంది, పోలీసులతో కలిసి అక్కడికి చేరుకున్నారు. ఎక్స్‌కవేటర్ సాయంతో ఫిల్టర్ ఇసుక తయారీ కేంద్రాలను కూల్చివేశారు. ఇసుక డంపులను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా స్థానికులు కొందరు అధికారులతో మాట్లాడారు. వెంకట్‌రెడ్డిపల్లి, బొమ్మికుంటతండా, సాకిరేవు, ముకర్లాబాద్ రైతు వేదిక నుంచి గుట్ట వైపునకు వెళ్లే ప్రాంతాల్లో ఫిల్టర్ ఇసుక తయారీ కేంద్రాలున్నాయని, వాటిని కూడా తొలగించాలని కోరారు. ఫిల్టర్ ఇసుక తయారీ, అక్రమ రవాణాపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో డీటీ శేఖర్, సీనియర్ అసిస్టెంట్ శివశంకర్, జీసీవోలు శ్రీనివాస్‌గౌడ్, బుడ్డన్న,హెడ్‌కానిస్టేబుల్ ఆనంద్, అశ్వకర్థిక్, వీరేంద్ర తదితరులు ఉన్నారు.

నాలుగు యూనిట్లలో విద్యుత్ ఉత్పత్తి

ఆత్మకూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు వరద స్వల్పంగా వస్తుండటంతో ఎగువ, దిగువ జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల్లో నాలుగు యూనిట్ల ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నట్లు ఎస్ఈ శ్రీధర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎగువ కేంద్రంలో 2 యూనిట్ల ద్వారా 1.806 మిలియన్ యూనిట్లు, ఇప్పటి వరకు 501.697 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి చేశారు. దిగువ కేంద్రంలో రెండు యూనిట్ల ద్వారా 2.034 మిలియన్ యూనిట్లు, ఇప్పటి వరకు 492.537 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి అయినట్లు ఎస్ఈ తెలిపారు.

జూనియర్ అసిస్టెంట్ సస్పెన్షన్


మహబూబ్‌నగర్ న్యూటౌన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : పంచాయతీ కార్యదర్శి ఆత్మహత్యకు కారణమైన జూనియర్ అసిస్టెంట్‌పై సస్పెన్షన్ వేటు పడింది. మహబూబ్‌నగర్ జిల్లా, మిడ్జిల్ మండలంలోని వెలుగొమ్ముల పంచాయతీ కార్యదర్శి రాజశ్రీ గత నెల 27న ఆత్మహత్య చేసుకున్నది. అందుకు కారణమైన ఎంపీడీవో కార్యాలయ జూనియర్ అసిస్టెంట్ సదా శ్రావణ్‌కుమార్‌పై పోలీసులు కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించారు. ఈ విషయంపై పోలీసులు మిడ్జిల్ ఎంపీడీవోకు రిపోర్ట్ చేశారు. దీంతో ఆయనను సస్పెండ్ చేస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

ఈనెల 14, 27 తేదీల్లో
సౌత్‌జోన్ పోటీలకు క్రీడాకారుల ఎంపిక

పాలమూరు యూనివర్సిటీ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ సౌత్‌జోన్ పోటీలకు క్రీడాకారులను ఎంపిక చేయనున్నట్లు పాలమూరు యూనివర్సిటీ పీడీ శ్రీనివాస్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పీయూ పరిధిలోని అన్ని కళాశాలల విద్యార్థులకు పోటీల్లో పాల్గొనే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఈనెల 14న రెజ్లింగ్ మహిళలు, 27న వాలీబాల్ పురుషుల జట్ల ఎంపిక నిర్వహించనున్నట్లు తెలిపారు. క్రీడాకారులు ఒక రోజు ముందు పేర్లు నమోదు చేయించుకోవాలని సూచించారు. ఈ పోటీల్లో ఎంపికైన క్రీడకారులు కాకినాడలోని జేఎన్‌టీయూ యూనివర్సిటీలో వాలీబాల్, రాజస్థాన్‌లోని కోటా యూనివర్సిటీలో రెజ్లింగ్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

అక్రమంగా తరలిస్తున్న పశువుల పట్టివేత

» ఇద్దరిపై కేసు నమోదు


పోలీసులు స్వాధీనం చేసుకున్న పశువులు

మరికల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : నారాయణపేట జిల్లా, మరికల్ మండల శివారులో పశువులను అక్రమంగా తరలిస్తున్న వాహనాన్ని పట్టుకున్నట్లు ఎస్ఐ రాము తెలిపారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మంగళవారం కర్ణాటక నుంచి రాష్ట్రంలోని షాద్‌నగర్ వైపు అనుమతి లేకుండా పశువులను తరలిస్తున్న వాహనాన్ని మరికల్ మండల శివారులో పోలీసులు తనిఖీ చేశారు. అందులో 8 ఎద్దులు, 5 ఆవులు, 1 గేదె ఉన్నట్లు గుర్తించారు. వాటిని కర్ణాటక రాష్ట్రంలోని గంగావతికి చెందిన వాహనం యజమాని ఖలీం, డ్రైవర్ రామన్న తరలిస్తున్నట్లు విచారణలో వెల్లడైంది. దీంతో వారిద్దరి కేసు నమోదు చేశారు. పశువులను నర్వ మండలంలోని శంకర్‌లింగం గోశాలకు తరలించారు.

కృషికి దక్కిన ఫలితం

» పకడ్బందీగా నూతన విద్యా విధానాల అమలు
» టాప్ టెన్‌లో పెద్రిపహాడ్ పీఎంశ్రీ పాఠశాల
» పురస్కారం అందుకున్న ప్రధానోపాధ్యాయుడు బాలకిష్టప్ప


విద్యార్థులకు ల్యాబ్‌లో ప్రయోగం చేసి చూపిస్తున్న ఉపాధ్యాయుడు


టీవీ ద్వారా విద్యార్థులకు బోధన

మద్దూర్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు, సిబ్బంది చేసిన కృషికి తగిన ఫలితం లభించింది. నారాయణపేట జిల్లా, మద్దూరు మండలంలోని పెద్రిపహాడ్‌లోని పీఎంశ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ప్రత్యేక గుర్తింపు లభించింది. రాష్ట్రంలోని టాప్-10 పీఎంశ్రీ పాఠశాలల్లో స్థానం సంపాదించుకున్నది. మూడేళ్ల క్రితం కేంద్ర ప్రభుత్వం ఈ పాఠశాలను పీఎంశ్రీకి ఎంపిక చేసింది. అందులో భాగంగా పాఠశాలలో విద్యార్థులకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు కల్పించింది. ఇక్కడ 6 నుంచి 10 తరగతులు కొనసాగుతుండగా, 13 మంది ఉపాధ్యాయులున్నారు. ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన విద్యావిధానాలను పకడ్బందీగా అమలు చేయడంలో పాఠశాల ముందంజ వేసింది. అందుకు ప్రధానోపాధ్యాయుడు బాలకిష్టప్ప ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు చేసిన కృషితో రాష్ట్రంలోనే ఉత్తమ పాఠశాలగా రూపుదిద్దుకున్నది. అందుకు గుర్తింపుగా గత 4న హైదరాబాద్‌లోని కొమురంభీం భవనంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ప్రధానోధ్యాయుడు బాల కిష్టప్ప పురస్కారాన్ని అందుకున్నారు.

పరిశోధనాత్మక విద్యాబోధన

పీఎంశ్రీ ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు నూతన విద్యావిధానానికి అనుగుణంగా వివిధ అంశాలపై పరిశోధనాత్మక ప్రక్రియలో విద్యాబోధన చేస్తున్నారు. సైన్స్‌ల్యాబ్, డిజిటల్ లెర్నింగ్, రోబోటిక్స్, ఏక్‌భారత్, కలాండైరీ, క్షేత్ర పరిశీలన, పర్యాటక కేంద్రాల సందర్శన, శ్రేష్ఠ భారత్, ఫీల్డ్ విజిట్, ప్రయోగాత్మక విశ్లేషణ తదితర విధానాలతో విద్యార్థులకు బోధిస్తున్నారు. దీంతో పాటు యోగా, వృత్తివిద్యా కోర్సుల్లో తర్ఫీదు ఇస్తున్నారు. అలాగే విద్యాబోధన, నేర్చుకోవడంలో విద్యార్థుల తీరుపై పర్యవేక్షణకు సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ఇలా నూతన విద్యావిధానాన్ని పకడ్బందీగా అమలు చేయడంతో రాష్ట్రంలోనే టాప్-10 పాఠశాలల్లో స్థానం సంపాదించుకున్నది.

ఎంతో నేర్చుకుంటున్నాం



మా బడి పీఎంశ్రీకి ఎంపికకావడంతో మాకు ఎంతో మేలు జరిగింది. కొత్త బోధనా సామగ్రి అందుబాటులోకి రావడంతో చక్కగా చదువుకునేందుకు అవకాశం లభించింది. ఎన్నో కొత్త విషయాలను తెలుసుకుంటున్నాం, నేర్చుకుంటున్నాం. ఉపాధ్యాయులు ప్రతీ విషయాన్ని ఎంతో ఓపికతో బోధిస్తున్నారు.

- అనూష, 9వ తరగతి

పీఎంశ్రీకి ఎంపికవడం మా అదృష్టం



పాఠశాల పీఎంశ్రీ పథకానికి ఎంపిక కావడం మా అదృష్టం. దీంతో బడికి ఎన్నో అధునాతన సౌకర్యాలు అందుబాటులోకి వచ్చాయి. తద్వారా బోధనా విధానంలో కొత్త మార్పు వచ్చింది. సబ్జెక్టుపై విద్యార్థులకు ప్రయోగాల ద్వారా వివరించే అవకాశం లభించింది. దీనివల్ల విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదిగేందుకు అవకాశం లభించనున్నది.

- వరుణ్ సందేశ్, 9వ తరగతి

బాధ్యతాయుత కృషికి దక్కిన గౌరవం



పెద్రిపహాడ్ ఉన్నత పాఠశాల పీఎంశ్రీకి ఎంపికవడంతో ప్రభుత్వం అనేక అదనపు సదుపాయాలను కల్పించింది. అందుకు తగినట్లుగా సిబ్బంది కూడా బాధ్యాతాయుతంగా పని చేసి పాఠశాలను టాప్-10లో నిలిచేందుకు కృషి చేశారు. ఇది అందరి సమష్టి బాధ్యత. భవిష్యత్‌లో మరింత ముందుకెళ్లేందుకు కలిగిన గౌరవంగా భావిస్తున్నాం.

- బాలకిష్టప్ప, ప్రధానోపాధ్యాయుడు

ప్రయోగాత్మకంగా 'పోల్ ట్రాన్స్‌ఫార్మర్'


విద్యుత్ అధికారులను సన్మానిస్తున్న కాలనీవాసులు

» తక్కువ స్థలంలో ఏర్పాటు చేసే అవకాశం
» తొలి సారి మహబూబ్‌నగర్ పట్టణంలో ఏర్పాటు
» లో ఓల్టేజీ సమస్య పరిష్కారానికి ప్రత్యేక చర్యలు

పాలమూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : లోఓల్టేజీ సమస్యను పరిష్కారించాలని విద్యుత్ శాఖ అధికారులకు ప్రజల నుంచి తరుచూ వినతులు వస్తుంటాయి. అందుకు అదనపు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. కానీ దాన్ని ఏర్పాటు చేసేందుకు ఆటంకాలు ఎదురవుతుంటాయి. మా ఇంటి వద్దంటూ కొందరు, మా గల్లీలు వద్దేవద్దని మరికొందరు అభ్యంతరాలు చెప్తుంటారు. దీంతో సమస్య పరిష్కారానికి విద్యుత్ శాఖ అధికారులు కొత్త మార్గాన్ని అన్వేషించారు. పోల్ మౌంటెడ్ ట్రాన్స్‌ఫార్మర్లు (పోల్ ట్రాన్స్‌ఫార్మర్లు) ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. విద్యుత్ సంస్థ సీఎండీ ఎండీ ముషారఫ్‌అలీ వీటిని హైదరాబాద్‌లో ప్రయోగాత్మకంగా ఏర్పాటు చేయించారు. అక్కడ విజయవంతం కావడంతో మహబూబ్‌నగర్ జిల్లాలోనూ ఏర్పాటు చేయించాలని నిర్ణయించారు. అందులో భాగంగా జిల్లా కేంద్రంలోని పాల్‌సాబ్‌గుట్ట కాలనీలో పోల్‌ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు.

సమస్య పరిష్కారమైంది



ఎర్రసత్యం చౌరస్తా, పాల్‌సాబ్ గుట్ట, క్రిస్టియన్ కాలనీ తదితర ప్రాంతాల్లో చాలా కాలంగా లోఓల్టేజీ సమస్య ఉంది. ఆయా ప్రాంతాల్లో ఎక్కడ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలన్నా, స్థలం ప్రధాన సమస్యగా ఉంది. ప్రజాబాటలో అధికారులకు మా సమస్య వివరించడంతో పోల్‌ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. దీంతో సమస్య పరిష్కారమైంది.

- ఎ.బాలరాజు, కాలనీవాసి

ఖర్చు కూడా తక్కువ

'పోల్ మౌంటెడ్ ట్రాన్స్‌ఫార్మర్'ను తక్కువ స్థలంలోనే ఏర్పాటు చేసే అవకాశం ఉంటుంది. ఖర్చు కూడా తక్కువ అవుతుంది. సాధారణంగా ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు 4 బై 4 స్థలం అవసరం అవుతుంది. కానీ పోల్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయొచ్చు. చిన్న గల్లీలో అయినా సరే స్తంభం పాతేందుకు అవసరమయ్యే స్థలంలోనే దీనిని సులువుగా ఏర్పాటు చేయవచ్చు. ఉమ్మడి జిల్లాలో మొదటిసారి మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో ప్రయోగాత్మంగా ఏర్పాటు చేసి లోఓల్టేజీ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకున్న విద్యుత్ శాఖ అధికారులను స్థానికులు ఘనంగా సన్మానించారు.

నిర్వీర్యమవుతున్న ప్రభుత్వ విద్య

» గీతం యూనివర్సిటీ ప్రొఫెసర్ జేడీ ప్రభాకర్
» ఘనంగా పీడీఎస్‌యూ 4వ జిల్లా మహాసభలు


పీడీఎస్‌యూ జెండా ఎగురవేస్తున్న నాయకులు

వనపర్తి టౌన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ విద్యరంగాన్ని పాలకులు నిర్వీర్యం చేస్తున్నారని గీతం యూనివర్సిటీ ప్రొఫెసర్ జేడీ ప్రభాకర్ విమర్శించారు. పీడీఎస్‌యూ జిల్లా 4వ మహాసభలను మంగళవారం వనపర్తి జిల్లా కేంద్రంలోని యాదవసంఘం భవనంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా నాయకుడు దినేశ్ ఆధ్వర్యంలో నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. పాలకుల నిర్లక్ష్యంతో ఉన్నోడికి ఒక విద్య, పేదోడికి మరో విద్య అందులోందన్నారు. విద్యారంగానికి అధిక నిధులు కేటాయిస్తామని ఎన్నికల ముందు చెప్తున్న నాయకులు అధికారం చేపట్టిన తరువాత ద్వంద్వ వైఖరిని అవలంబిస్తున్నారని విమర్శించారు. నూతన జాతీయ విద్యావిధానంలో భాగంగా విదేశీ యూనివర్సిటీలను స్వాగతిస్తూ, చరిత్రను వక్రీకరించేందుకు కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. మత రాజకీయాలను పాఠ్యాంశాలుగా చేర్చేందుకు యత్నిస్తున్నారని మండిపడ్డారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడుగా దినేశ్, ప్రధాన కార్యదర్శిగా గణేశ్, కోశాధికారిగా గోవర్ధన్‌తో పాటు మరో 11 మందిని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు. సమావేశంలో పీడీఎస్‌యూ రాష్ట్ర నాయకులు అనిల్, అరుణ్‌కుమార్, టీపీటీఎస్ జిల్లా కార్యదర్శి కొంకల వెంకటనారాయణ, పీడీఎస్‌యూ జిల్లా మాజీ అధ్యక్షుడు గణేశ్, ఏదుట్ల కురుమయ్య పాల్గొన్నారు.

పోలీసుల వైఖరిపై నిరసన

» ఐదు రోజుల క్రితం తెల్లరాళ్లపల్లిలో ఘర్షణ
» ఫిర్యాదు చేసినా కేసు నమోదు చేయలేదని ఆరోపణ
» పోలీస్ స్టేషన్ ఎదుట బాధిత కుటుంబ సభ్యుల ధర్నా
» మనస్తాపంతో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం


పోలీస్ స్టేషన్ ఎదుట ప్రధాన రహదారిపై ధర్నా చేస్తున్న బాధితులు

పాన్‌గల్ ,నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : ఇరువర్గాల మధ్య 5 రోజుల క్రితం ఘర్షణ జరిగింది. ఈ విషయంపై ఫిర్యాదు చేసినా పోలీసులు నమోదు చేయకపోడంతో బాధిత కుటుంబ సభ్యులు స్టేషన్ ఎదుట ధర్నా చేపట్టారు. వనపర్తి జిల్లా, పాన్‌గల్ మండల పరిధిలోని తెల్లరాళ్లపల్లి తండాకు చెందిన బీఆర్ఎస్ నాయకుడు బాబూనాయక్ కుటుంబ సభ్యులపై అదే గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు బాలునాయక్, రాజునాయక్, భాస్కర్‌నాయక్ కుటుంబ సభ్యులు 5 రోజుల క్రితం దాడి చేశారు. సంఘటనపై బాధితులు పాన్‌గల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయినా కేసు నమోదు చేయలేదు. దీంతో బాధితులు రాజేశ్, మున్నా, రామకృష్ణ, చిరు మంగళవారం పాన్‌గల్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లారు. వారితో ఎస్ఐ దురుసుగా మాట్లాడి, సాయంత్రం వరకు అక్కడే కూర్చోబెట్టారు. విషయం తెలుసుకున్న బాబూనాయక్ పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని ఎస్ఐతో మాట్లాడగా ఆయన దుర్భాష లాడారు. రౌడీషీట్ ఓపెన్ చేస్తానని బెదిరించాడు. దీంతో అతడు కుటుంబ సభ్యులతో కలిసి స్టేషన్ ముందు ధర్నా చేపట్టారు. దీంతో మనస్తాపం చెందిన బాబునాయక్ తన వెంట తెచ్చుకున్న పురుగుల మందును తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. కుటుంబ సభ్యులు అతడిని వనపర్తి జిల్లా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్న బాబు నాయక్‌ను బీఆర్ఎస్ ఎస్టీసెల్ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్‌నాయక్, మండల అధ్యక్షుడు పెట్టేటి వీరసాగర్ పరామర్శించారు. ఎస్ఐని వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. మానవ హక్కుల కమిషన్‌కు కూడా ఫిర్యాదు చేస్తామని చెప్పారు. ఈ విషయంపై ఎస్ఐ శ్రీనివాస్‌ను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా, ఇరు వర్గాల వారు మాట్లాకుంటామని చెప్పడంతో కేసు నమోదు చేయలేదని తెలిపారు. తండాలో పోచమ్మ పండుగ ఉండడంతో మాట్లాడుకోవడంలో జాప్యం జరిగిందన్నారు. తమకు ఎవరిపై పక్షపాతం లేదని, చట్టం దృష్టిలో అందరూ సమానమేనని తెలిపారు.

రికార్డు స్థాయిలో వరద

(5వ పేజీ తరువాయి)

చివరి ఆయకట్టుకు వరకు ఇవ్వలేని పరిస్థితులు ఉన్నాయి. ఈ ఏడాది భారీగా వరద వచ్చినప్పటికీ మెజారిటీ నీరు సముద్రంలో కలిసిపోయింది. దిగువ కృష్ణా బేసిన్‌లోని ఆలమట్టి ప్రాజెక్టుకు ఈ ఏడాది 776.28 టీఎంసీల వరద వచ్చింది. ఆ తర్వాత నారాయణపూర్‌కు 776.65 టీఎంసీలు, భీమాపై ఉన్న ఉజ్జయినికి 188.79 టీఎంసీలు, జూరాలకు 1,595.51 టీఎంసీల వరద వచ్చింది. ఆ తర్వాత తుంగభద్ర డ్యాంకు 411.39 టీఎంసీలు రాగా.. శ్రీశైలానికి అత్యధికంగా 2,297 టీఎంసీల నీరు వచ్చింది. నాగార్జునసాగర్‌కు 1,786 టీఎంసీలు, పులిచింతలకు 1,491 టీఎంసీలు వచ్చింది. కృష్ణా డెల్టా సిస్టంకు 1,767 టీఎంసీల వరద రాగా.. సుముద్రంలో దాదాపు 1,700ా పైచిలుకు టీఎంసీల నీరు కలిసిపోయింది. అత్యధికంగా నీటి వినియోగం ఈ ఏడాది శ్రీశైలం వద్ద జరిగిది. సుమారు 500 టీఎంసీలకు పైగా నీటిని పోతిరెడ్డిపాడు, హంద్రీనీవా, కల్వకుర్తి పథకాలకు తరలించారు. ఏపీవైపు సుమారు 496 కిలో మీటర్ల దూరంలో కుప్పం వరకు కృష్ణానీటిని తరలించారు. అలాగే ఈ ఏడాది జల విద్యుత్ కూడా రికార్డు స్థాయిలో జరిగింది. జూన్‌లో ప్రారంభమైన విద్యుదుత్పత్తి జూరాల నుంచి నాగార్జునసాగర్ వరకు ఇంకా కొనసాగుతూనే ఉంది. అయితే శ్రీశైలంతో పోటీపడి విద్యుదుత్పత్తి చేయడం వల్ల వేసవిలో తాగునీటికి ఇబ్బందులు ఏర్పడతాయనే పలువురు అభిప్రాయపడుతున్నారు.

తిమ్మాజిపేట బస్టాండ్‌ను
పరిశీలించిన ఆర్ఎం


తిమ్మాజిపేట బస్టాండ్ ఆవరణలో మహబూబ్‌నగర్ రీజినల్ మేనేజర్ సంతోష్‌కుమార్, కాంగ్రెస్ నాయకులు

తిమ్మాజిపేట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల వినియోగంలోకి వచ్చిన బస్టాండ్‌లో ప్రయాణికులకు కావాల్సిన వసతులు త్వరలో ఏర్పాటు చేస్తామని ఆర్టీసీ మహబూబ్‌నగర్ రీజినల్ మేనేజర్ సంతోష్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని బస్టాండ్‌ను మంగళవారం ఆయన నాగర్‌కర్నూల్ డిపో మేనేజర్ యాదయ్యతో కలిసి పరిశీలించారు. నిరుపయోగంగా ఉన్న మూత్రశాలలను, దుకాణపు సముదాయాన్ని పరిశీలించి అక్కడికి చేరుకున్న కాంగ్రెస్ శ్రేణులతో మాట్లాడారు. ఇందుకు సంబంధించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యుత్‌దీపాల వెలుగులకు రంగులు వేయడానికి ప్రయాణికులు కూర్చోవడానికి కుర్చీలు వేయించడానికి ముందుకు దాతలు రావడం హర్షదాయకమని అన్నారు. రాష్ట్ర టెలికాం శాఖ డైరెక్టర్ శ్రీనివాస్‌బహదూర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు శ్రీరామ్, తిరుపతిరెడ్డి, బాబా, శ్రీను, ఆర్టీసీ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ బాల్‌రెడ్డి, సత్యం, ఎన్‌టీ.గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి వృథా .. తీరని వ్యథ


వృథాగా పోతున్న మిషన్ భగీరథ నీరు

వన్ననవార్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : తాగునీటిని వృథా చేస్తే వేసవిలో అవసరం ఉన్నప్పుడు తాగునీరు దొరకడం చాలా కష్టమవుతుంది. అమ్రాబాద్, పదర మండలాలకు తాగు నీటిని సరఫరా చేసే వన్ననవారంలోని శ్రీశైలం- హైదరాబాద్ రహదారి పక్కన మిషన్ బగీరథ సంపు, శుద్ధి కేంద్రాలు ఉన్నాయి. ఇక్కడ తాగునీరంతా ఓవర్‌ఫ్లో అయి నీరంతా పైపు గుండా వృథాగా పోతోంది. తాగునీరు వృథాగా పో కుండా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

మరో చోట పగిలిన పైపులైన్

అమ్రాబాద్ మండలం మన్ననూరులో రెండు రోజులుగా మిషన్ భగీరథ తాగునీటి సరఫరా నిలిచిపోయింది. గ్రామంలోని మన్ననూరు లింగమయ్య ఆలయం నుంచి అటవీ శాఖ చెక్‌పోస్టు వరకు గల పైపులైన్ పగిలిపోవడంతో నీటి ట్యాంకులకు సరఫరా నిలచిపోయి గ్రామంలో తాగునీటి సమస్య తలెత్తింది. గ్రామంలోని వ్యవసాయ బోర్ల నుంచి తాగునీటిని ప్రజలు తీసుకువస్తున్నారు. అధికారులు స్పందించి తాగునీటి సరఫరాకు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

క్రైం కార్నర్

చేపలవేటకు వెళ్లి వ్యక్తి మృతి

గుండుమాల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : చేపలవేటకు వెళ్లిన వ్యక్తి ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందాడు. ఈ సంఘటన నారాయణపేట జిల్లా, కోస్గి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఐ బాలరాజ్ కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. కల్వకుర్తి పట్టణానికి చెందిన ఓర్సు ఆంజనేయులు (30) బతుకుదెరువు కోసం గుండుమాల్ పక్కన అప్పాయిపల్లిలో నివసిస్తున్నారు. సోమవారం సాయంత్రం 5:30 గంటల ప్రాంతంలో ఈర్లపల్లి చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లాడు. ప్రమాదశాత్తు చెరువులో పడి మృతి చెందాడు. ఆంజనేయులు దివ్యాంగుడు కావడంతో ప్రమాదవశాత్తు చెరువులో పడి ఉండొచ్చని ఎస్ఐ తెలిపారు. ఆయనకు భార్య, కుమారుడు ఉన్నారని, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు.

చికిత్స పొందుతూ కన్నుమూత


కధీర్ (ఫైల్)

అయిజ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : దాడిలో తీవ్రంగా గాయపడిన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. అయిజ ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఖదీర్ (43) అనే వ్యక్తి తమ ఇంటికి వచ్చి తల్లితో అనవసరంగా మాట్లాడుతున్నారన్న అనుమానంతో ఈనెల 7వ తేదిన భరత్, చందులతో పాటు మరి కొందరు దాడి చేశారు. ఆ తర్వాత అయిజలోని ఆర్ అండ్ బీ అతిథిగృహం సమీపంలో తీవ్రంగా కొట్టారు. దీంతో కోమాలోకి వెళ్లిన ఖదీర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం చనిపోయాడు. అతడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. సంఘనపై బార్య ఆశన్‌బీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు శ్రీనివాసరావు తెలిపారు.

బైక్, బొలెరో ఢీకొని వ్యక్తి దుర్మరణం

» ముదిరెడ్డిపల్లి సమీపంలో ఘటన


వి.శ్రీహరి (ఫైల్)

రాజాపూర్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా, రాజాపూర్ మండల పరిధిలోని ముదిరెడ్డిపల్లి సమీపంలో, 44వ నెంబర్ జాతీయ రహదారిపై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. రాజాపూర్ ఎస్ఐ శివానందంగౌడ్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. భూత్పూర్ మండలంలోని మదిగట్లకు చెందిన వడ్ల శ్రీహరి (39) ద్విచక్రవాహనంపై గ్రామం నుంచి హైదరాబాద్ వైపు వెళ్తుండగా, ముదిరెడ్డిపల్లి శివారులోని దుందుభీ వాగు సమీపంలో వెనుక నుంచి వచ్చిన బొలెరో వాహనం ఢీకొన్నది. ప్రమాదంలో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికుల సాయంతో మృతదేహాన్ని జడ్చర్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అతడి భార్య వడ్ల రేఖ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఇసుక టిప్పర్ల పట్టివేత


పోలీసులు పట్టుకున్న ఇసుక టిప్పర్లు

దామరగిద్ద, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా, కోయిలకొండ మండలంలోని ఆచార్యపూర్ నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు టిప్పర్లను పట్టుకున్నట్లు దామరగిద్ద ఎస్ఐ రాజు తెలిపారు. అదే గ్రామానికి చెందిన గోవిందుతో పాటు మరో వ్యక్తి మంగళవారం రెండు టిప్పర్లలో ఇసుకను తరలిస్తుండగా, దామరగిద్ద తండా వద్ద పట్టుకున్నట్లు ఆయన చెప్పారు. వాహనాలను స్వాధీనం చేసుకొని స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

150 గ్రాముల గంజాయి స్వాధీనం


ఎక్సైజ్ పోలీసులకు పట్టుబడిన గంజాయి కేసు నిందితులు

మహబూబ్‌నగర్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : గంజాయి విక్రయం, సరఫరాపై పోలీసులు కఠిన చర్యలు తీసుకుంటున్నా దందా ఆగడం లేదు. గంజాయి విక్రయిస్తూ మంగళవారం మరో ఇద్దరు వ్యక్తులు పోలీసులకు పట్టుబడ్డారు. ఎక్సైజ్ సీఐ వీరారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. బిహార్‌కు చెందిన బ్రిజేష్ కుమార్ జడ్చర్ల మండలంలోని ముదిరెడ్డిపల్లిలోగల ప్లాస్టిక్ కంపెనీలో పనిచేస్తున్నాడు. అతడు బిహార్ నుంచి గంజాయి తీసుకొచ్చి, మహబూబ్‌నగర్‌లోని శ్రీనివాసకాలనీకి చెందిన శ్రీరాజ్ అనే వ్యక్తి ద్వారా విక్రయిస్తున్నాడు. మంగళవారం తెల్లవారుజామున ఎక్సైజ్ సీఐ సుష్మ ఆధ్వర్యంలో అప్పన్నపల్లి ఫ్లైఓవర్ దగ్గర వాహనాలను తనిఖీ చేస్తుండగా వారు ద్విచక్రవాహనంపై వస్తూ అనుమానాస్పదంగా కనిపించారు. వారిని సోదా చేయగా, 150 గ్రాముల ఎండు గంజాయి లభించింది. దీంతో వారిని అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. తనిఖీల్లో ఎక్సైజ్ సిబ్బంది బబ్బిష్, వినోద్, కళానందం పాల్గొన్నారు.

25 మేకల అపహరణ

గుండుమాల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : నారాయణపేట జిల్లా, గుండుమాల్ మండలంలోని బోగారం గ్రామంలో గుర్తుతెలియని వ్యక్తులు 25 మేకలను అపహరించారు. గ్రామానికి చెందిన హనుమన్‌పల్లి గంగయ్య, ఎద్దుల శ్రీనివాసులు కుటుంబ సభ్యులు సోమవారం సాయంత్రం మేకలను ఇంటి ఆవరణలో ఉంచి లోపల పడుకున్నారు. అర్ధరాత్రి సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి తలుపులకు బయట నుంచి గొళ్లెం పెట్టి 25 మేకలను ఎత్తుకెళ్లారు. అలికిడికి నిద్రలేచిన కుటుంబ సభ్యులు గొళ్లె పెట్టిన తలుపులను తెరవలేకపోయారు. దీంతో పక్కింటివారికి ఫోన్ చేసి తలుపులు తీసే లోపు దొంగలు మేకలను తీసుకొని పారిపోయారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ బాలరాజ్ తెలిపారు.

గుడికి వెళ్లి వచ్చేలోపు.. నగలు, నగదు చోరీ


ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న క్లూజ్‌టీం సభ్యులు

వంగూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : గుడికి వెళ్లి వచ్చేలోపు ఇంట్లోకి చొరబడిన దొంగలు నగలు, నగదు దోచుకెళ్లారు. ఈ సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా, వంగూరు మండలంలోని తుమ్మలపల్లిలో మంగళవారం ఉదయం జరిగింది. బాధితులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన ఆరెకంటి నిరంజన్ ఇంటి తలుపులు దగ్గరగా వేసి, కుటుంబసభ్యులతో కలసి సమీపంలోని గుడికి వెళ్లారు. అరగంటలోపు తిరిగి ఇంటికి వచ్చి చూసేసరికి తలుపులు తెరిచి ఉన్నాయి. లోపలికి వెళ్లి చూడగా, బీర్వా తెరిచి ఉంది. పరిశీలించగా అందులోని రూ.20 వేలు 2.5 తులాల బంగారం, 20 తులాల వెండి అభరణాలు చోరీకి గురైనట్లు గుర్తించారు. వెంటనే ఎస్ఐ మహేష్‌గౌడ్‌కు ఫోన్ చేయడంతో, ఆయన సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించి, వివరాలు తెలుసుకున్నారు. క్లూజ్‌టీంను రప్పించి ఆనవాళ్లు సేకరించారు. అనుమానితులను అదుపులోకి తీసుకున్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

పొగచూరుతున్న మధ్యాహ్న భోజనం


పులికల్‌లో పాఠశాల ఆవరణలో కట్టెలపొయ్యిపై వంట చేస్తున్న ఏజెన్సీ మహిళలు

» ప్రభుత్వ పాఠశాలలకు అందని గ్యాస్ సిలిండర్లు
» కట్టెల పొయ్యిపై వంట చేయిస్తున్న ఏజెన్సీలు
» పొగతో ఉపాధ్యాయులు, విద్యార్థులకు ఇక్కట్లు

అయిజ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని సిద్ధం చేసేందుకు గ్యాస్ సిలిండర్లు అందక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అనివార్యంగా కట్టెల పొయ్యిమీద వంట చేస్తుండటంతో పొగతో ఏజేన్సీ నిర్వాహకులు ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. తరగతి గదుల్లోకి పొగ చేరుతుండటంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బంది పడుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం గత ఆగస్టు 15 నాటికి అన్ని ప్రభుత్వ పాఠశాలలకు ఎల్‌పీజీ కనెక్షన్లు ఇస్తామని ప్రకటించింది. అందుకు అనుగుణంగా పాఠశాల విద్యాశాఖ సంచాలకులు నవీన్ నికోలస్ జూలై 2వ వారంలోనే కలెక్టర్లకు ఉత్తర్వులు జారీ చేశారు. కానీ ఇప్పటివరకు ఆ దిశగా ఇప్పటివరకు ఎలాంటి చర్యలూ తీసుకోలేదు.

ప్రభుత్వ పరిశీలనలో ఉంది



విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వండేందుకు ఎల్‌పీజీ కనెక్షన్ల ఏర్పాటు అంశం పరిశీలనలో ఉంది. కానీ ఇప్పటివరకు కచ్చితమైన ఆదేశాలు అందలేదు. ప్రభుత్వం నుంచి ఆదేశాలు అందిన వెంటనే అమలుకు చర్యలు తీసుకుంటాం. విద్యార్థులు, ఉపాధ్యాయులతో పాటు ఎజెన్సీ మహిళలు పడుతున్న ఇబ్బందులను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం.

- విజయలక్ష్మి, జిల్లా విద్యాధికారి

కట్టెల పొయ్యిపై వంట కష్టాలు

జోగుళాంబ గద్వాల జిల్లాలోని 452 ప్రభుత్వ పాఠశాలకు ఎల్‌పీజీ గ్యాస్ కనెక్షన్లు అవసరమున్నట్లు అధికారులు గుర్తించారు. జిల్లాలోని 1వ తరగతి నుండి 10వ తరగతి వరకు 69,612 మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్నారు. ఆయా పాఠశాలల్లో వంట ఏజన్సీ మహిళలు కట్టెల పొయ్యిపై వంట చేసేందుకు కష్టాలు పడుతున్నారు. వంట గదులు లేకపోవడం, ఉన్నా ఇరుకుగా ఉండటంతో ఇక్కట్లు తప్పడం లేదు. దీంతో ఆరుబయట కట్టెలపొయ్యి మీద వంట చేస్తున్నారు.

తరగతి గదుల్లో పొగ చేరుతుండటంతో విద్యార్థులు, ఇబ్బంది పడుతున్నారు. విద్యార్థులు చదువుపై దృష్టి సారించలేకపోతున్నారు. ఆరు బయట వంట చేస్తుండటంతో ఆహార పదార్థాల్లో దుమ్ము, దూళి పడుతోందని, పొగచూరి భోజనం రుచి తప్పుతోందని విద్యార్థులు చెప్తున్నారు. వర్షాకాలంలో వంట చేసేందుకు మరింతగా ఇబ్బంది పడుతున్నారు. అలాగే వంట చెరుకు కోసం కష్టాలు తప్పడం లేదు.

నేడు జిల్లాస్థాయి సాంస్కృతిక పోటీలు

ఐదు అంశాల్లో నిర్వహణ : డీవైఎస్‌వో


ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీవైఎస్‌వో శ్రీనివాస్

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : జిల్లా యువజన క్రీడల శాఖ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా స్థాయి సాంస్కృతిక పోటీలు నిర్వహించనున్నట్లు డీవైఎస్‌వో శ్రీనివాస్ తెలిపారు. అందుకు సంబంధించి, ఇండోర్ స్టేడియంలో జరుగుతున్న ఏర్పాట్లను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువతలో సాంస్కృతిక సృజనను వెలితీసేందుకు పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మొత్తం 5 అంశాలు జానపద నృత్యాలు, జానపద గేయాలు, కవితా రచన, పెయిటింగ్, వృక్తృత్య పోటీలు ఉంటాయని చెప్పారు. ఆయా అంశాల్లో ప్రథమ స్థానంలో నిలిచిన వారిని త్వరలో హైదరాబాద్‌లో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీలకు పంపిస్తామని తెలిపారు. ఆయన వెంట క్రీడాశాఖ అధికారి కిశోర్, సీనియర్ అసిస్టెంట్ రవీందర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

యోగా టోర్నీలో పతకాలు సాధించాలి

» ఎస్‌జీఎఫ్ సెక్రటరీ డాక్టర్ శారదాబాయి
» ఉత్సాహంగా ఉమ్మడి జిల్లా యోగా జట్ల ఎంపిక


ఉమ్మడి జిల్లా యోగా క్రీడాకారులతో ఎస్‌జీఎఫ్ సెక్రటరీ డా. శారదాబాయి

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రస్థాయి యోగా టోర్నీలో జిల్లా విద్యార్థులు పతకాలు సాధించాలని ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి డాక్టర్ శారదాబాయి అన్నారు. జిల్లా స్కూల్ గేమ్స్ ఫేడరేషన్ ఆధ్వర్యంలో మహబూబ్‌నగర్ పట్టణంలోని ఇండోర్ స్టేడియంలో మంగళవారం ఉమ్మడి జిల్లా అండర్-14, 17, 19 యోగా జట్ల ఎంపికకు పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎంపిక ప్రక్రియను పారదర్శకంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఉమ్మడి జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 15 నుంచి 17వ తేదీ వరకు కరీంనగర్‌లో నిర్వహించన్న రాష్ట్రస్థాయి టోర్నీలో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు బాలరాజయ్య, అరుణజ్యోతి, వేణుగోపాల్, జగన్‌మోహన్‌గౌడ్ పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లా జట్ల ఎంపిక

» రేపు నెట్‌బాల్, 15న షటిల్‌బ్యాడ్మింటన్

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి) : వివిధ క్రీడా పోటీలకు సంబంధించి ఉమ్మడి జట్లను ఈనెల 13, 15 తేదీల్లో ఎంపిక చేయనున్నారు. స్కూల్ గేమ్స్ ఫేడరేషన్ ఆధ్వర్యంలో ఈనెల 13న అండర్-14, 17, 19 నెట్‌బాల్ బాల, బాలికల జట్లను ఎంపిక చేయనున్నట్లు ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి శారదాబాయి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అండర్ 14, 17 క్రీడాకారులు బోనఫైడ్, ఆధార్‌కార్డు జిరాక్స్‌లు, అండర్-19 క్రీడాకారులు 10వ తరగతి మెమో, ఆధార్ జిరాక్స్‌లతో ఉదయం 9 గంటలకు స్టేడియం మైదానంలో పీడీ జ్యోతికి రిపోర్టు చేయాలని కోరారు.

● అండర్-14, 17 ఉమ్మడి జిల్లా షటిల్‌బ్యాడ్మింటన్ బాల, బాలికల జట్లను ఈ నెల 15న ఎంపిక చేయనున్నట్లు ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి శారదాబాయి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అండర్-14, 17 క్రీడాకారులు స్కూల్ బోనఫైడ్, ఆధార్‌కార్డు జిరాక్స్‌లతో ఉదయం 9 గంటలకు స్టేడియం మైదానంలో వ్యాయమ ఉపాధ్యాయుడు సాదత్‌ఖాన్‌కు రిపోర్టు చేయాలని కోరారు.

14న జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీలు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి) : అథ్లెటిక్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆదేశాల మేరకు ఈ నెల 14న మహబూబ్‌నగర్ జిల్లా ప్రధాన స్టేడియంలో జిల్లా స్థాయి బాలికల అండర్-14, 16 అథ్లెటిక్స్ పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శరత్‌చంద్ర మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థినులలోని ప్రతిభను వెలికి తీసేందుకు అస్మిత, ఖేలో ఇండియా అథ్లెటిక్స్ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా - ఎస్ఎస్ఆర్ఎస్ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేయించుకున్న క్రీడాకారులకు మాత్రమే పోటీల్లో పాల్గొనే అవకాశం ఉంటుందని తెలిపారు. ఆసక్తిగల క్రీడాకారులు ఉదయం 9 గంటలకు స్టేడియంలో రిపోర్టు చేయాలని కోరారు.

మేమెంతో మాకంత!

» బీసీలకు రిజర్వేషన్ ఫలాలు దక్కాల్సిందే
» 13వ తేదీన పాలమూరులో 'ధర్మ నిరాహార దీక్ష'
» బీసీ జేఏసీ చైర్మన్ బెక్కెం జనార్దన్



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న బీసీ జేఏసీ చైర్మన్ బెక్కెం జనార్దన్

పాలమూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : మేమెంతో మాకంత రిజర్వేషన్ ఫలాలు దక్కాల్సిందేనని బీసీ జేఏసీ చైర్మన్ బెక్కెం జనార్దన్ డిమాండ్ చేశారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని రెడ్‌క్రాస్ భవనంలో మంగళవారం నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ న్యాయమైందని కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్, కమ్యూనిస్టు నాయకులు చెప్తున్నారు కానీ ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. తమిళనాడు ప్రభుత్వం చేసినట్లు ఈ అంశాన్ని 9వ షెడ్యూల్‌లో చేర్చి, పార్లమెంట్ ఆమోదం పొందాలన్నారు. కేవలం 2 శాతానికి మించని వారు ఈడబ్ల్యుఎస్ పేరున 10 శాతం రిజర్వేషన్ తీసుకోవాడం దారుణమన్నారు. స్థానిక, ఎంపీ, ఎమ్మెల్యే ఎన్నికలతో పాటు, ఉద్యోగాల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. అందుకోసం జిల్లా కేంద్రంలో 13వ తేదీన 'ధర్మ నిరాహార దీక్ష' చేపడుతున్నట్లు ప్రకటించారు. సదస్సు అనంతరం కవి అందెశ్రీకి ఘనంగా నివాళి అర్పించారు. నాయకులు లక్ష్మణ్‌గౌడ్, కోరమోని వెంకటయ్య, మున్నూరు రాజు, రమేశ్‌గౌడ్, శివరాజు, ప్రభాకర్, కొండన్న, రిటైర్డ్ డీఎఫ్‌వో వెంకట్రాములు, గంగాధర్, పాండురంగం, కొండాబాలయ్య, ఎన్.ప్రభాకర్, మెట్టుకాడి ప్రభాకర్, చిట్యాల సుధాకర్, సత్తూరు చంద్రశేఖర్‌గౌడ్, కుమ్మరి బుగ్గన్న, రామ్మోహన్, ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు గద్వాల విద్యార్థిని



స్వాతిని అభినందిస్తున్న కరస్పాండెంట్, ప్రిన్సిపాల్ అధ్యాపకులు

గద్వాల అర్బన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని సరస్వతి పాఠశాలకు చెందిన విద్యార్థిని స్వాతి ఎంపికైనట్లు కరస్పాండెంట్ మాకం బీచుపల్లి తెలిపారు. మంగళవారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థిని అభినందించి మాట్లాడారు. ఈ నెల 3న వనపర్తి జిల్లాలో జరిగిన జోనల్ స్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరచిన స్వాతి, రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యిందని తెలిపారు. ఈ నెల 14 నుంచి 16 వరకు నల్గొండ జిల్లా డాన్ బాస్కో అకాడమీలో నిర్వహించనున్న అండర్-17 రాష్ట్ర స్థాయిలో పోటీల్లో పాల్గొంటుందని తెలిపారు. ప్రిన్సిపాల్ రాచాల వెంకటయ్య గౌడ్, ఇన్‌చార్జి వెంకట కృష్ణారెడ్డి, పీఈటీలు వేణు, ఆనంద్ విద్యార్థినిని అభినందించారు.

జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు ప్రారంభం

» గట్టు అంబాభవానీ ఉత్సవాల్లో భాగంగా నిర్వహణ


కబడ్డీ పోటీలను ప్రారంభిస్తున్న మాజీ సర్పంచ్ ధనలక్ష్మీ

గట్టు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా, గట్టు మండల కేంద్రంలో కొనసాగుతున్న ఉత్సవాల్లో భాగంగా మంగళవారం జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు ప్రారంభమయ్యాయి. మాజీ సర్పంచ్ ధనలక్ష్మీ, ఎంపీటీసీ మాజీ సభ్యురాలు అలేఖ్య శ్రీనాథ్ అధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ పోటీల్లో జిల్లా నలుమూలల నుంచి క్రీడాకారులు పాల్గొంటున్నారు. ముఖ్యఅతిథి మాజీ సర్పంచు ధనలక్ష్మి క్రీడాకారులను పరిచయం చేసుకొని పోటీలను ప్రారంభించారు.

విజేతలకు ప్రథమ బహుమతి రూ. 20 వేలు, ద్వితీయ బహుమతిరూ. 15 వేలు, తృతీయ బహుమతి రూ. 10 వేలు, 4వ బహుమతి రూ.5 వేల రూపాయలు అందించనున్నారు. కార్యక్రమంలో కాంట్రాక్టర్ కృష్ణమూర్తి, రిటైర్డ్ ఎంఈవో సత్యనారాయణ, శ్రీనాథ్, మెడికల్ రవి, దేవన్న తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఖోఖో జట్ల ఎంపిక


విజేత నవాబ్‌పేట బాలుర జట్టు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : అండర్-17 ఖోఖో బాల, బాలికల జట్ల టోర్నీ కమ్ సెలక్షన్లు ఉత్సాహ పూరిత వాతావరణంలో కొనసాగాయి. మహబూబ్‌నగర్ జిల్లా స్టేడియంలో మంగళవారం నిర్వహించిన ఈ పోటీలకు ముఖ్య అతిథిగా ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి శారదాబాయి హాజరై విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను ఉమ్మడి జిల్లా జట్టుకు ఎంపిక చేస్తామని తెలిపారు. విజేతలుగా నవాబ్‌పేట (బాలుర), బాలనగర్ (బాలికల), రన్నర్‌గా కొయిలకొండ (బాలురు), మహమ్మదాబాద్ (బాలికల) జట్లు నిలిచాయి. కార్యక్రమంలో పీడీలు దూమర్ల నిరంజన్, జగన్‌మోహన్‌గౌడ్, వేణుగోపాల్, వడెన్న, మొగులాల్, అబ్దుల్లా, నాగరాజు, శంకర్‌నాయక్, మేరీపుష్ప పాల్గొన్నారు.

ఊపిరి ఆడక ఉక్కిరిబిక్కిరి

» పెరుగుతున్న న్యుమోనియా కేసులు
» జోగుళాంబ గద్వాల జిల్లాలో ఈ ఏడాది 190 కేసులు
» చలికాలంలో ఎక్కువగా బాధించే వ్యాధి


గద్వాల ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న న్యుమోనియా బాధితులు

గద్వాల క్రైం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : ఊపిరి ఆడక ఉక్కిరిబిక్కిరి చేసే వ్యాధి న్యుమోనియా చలికాలంలో ఎక్కువగా వ్యాపిస్తుంది. బాధితులు ప్రత్యేక చికిత్స తీసుకోవడంతో పాటు, మందులను సక్రమంగా వాడితో వ్యాధి నియమవుతుందని వైద్యులు చెప్తున్నారు. ప్రధానంగా నాలుగు రకాల ఇన్‌ఫెక్షన్లు ఉంటాయి. అందులో సాధారణ జీవనంలో వచ్చే ఇన్‌ఫెక్షన్‌తో పాటు, ఆసుపత్రిలో చేరిప్పుడు, ఆహారం లేదా ద్రవాలు పొరపాటున ఊపిరితిత్తుల్లోకి వెళ్లినప్పుడు, శ్వాసకోస యంత్రం వినియోగించే వారిలో ఇన్‌ఫెక్షన్లు వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉన్నట్లు చెప్తున్నారు. ఈ వ్యాధితో జ్వరంతో పాటు దగ్గు, ఊపిరి పీల్చుకోవడంలో ఇబ్బంది, ఛాతీనొప్పి, అలసట, చమటలు పట్టడం, వృద్ధుల్లో గందరగోళం ఏర్పడటం వంటి లక్షణాలు కనిపిస్తాయి. వ్యాధి సోకిన వారు వైద్యులను సంప్రదించి చికిత్స చేయించుకుంటే స్వస్థత చేకూరుతుంది.

ప్రతీ నెల 15 కేసులు

జోగుళాంబ గద్వాల జిల్లాలో ప్రతీ నెల 15 కేసులకు పైగా వరకు నమోదవుతున్నాయి. ఈ ఏడాది ఇప్పటివరకు 190 కేసులు నమోదయ్యాయి. చలికాలంలో బాధితుల సంఖ్య ఎక్కువగా ఉంటోందని, ఇతర కాలాల్లో క్రమంగా తగ్గుతోంది. జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో న్యుమోనియా వార్డు ప్రత్యేకంగా లేదు కానీ, కేసు తీవ్రతను బట్టి బాధితులను ఐసీయూలో ఉంచి చికిత్స అందిస్తారు.

బాధితుల్లో ఎక్కువగా చిన్నారులు, వృద్ధులు, షుగర్, హృదయ, మూత్ర పిండాల వ్యాధిగ్రస్థులు, పొగతాగేవారు ఎక్కువగా ఉంటున్నారు.

జాగ్రత్తలు తప్పనిసరి



న్యుమోనియా విషయంలో రోగులు తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలి. చిన్నపిల్లలకు సకాలంలో టీకాలు వేయించాలి. వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి. పెద్దలు పొగతాగే అలవాటు ఉంటే వెంటనే మానుకోవాలి. వాయుకాలుష్యంపై అప్రమత్తంగా ఉండాలి. పౌష్టికాహారం తీసుకుంటూ, రోగ నిరోధక శక్తి పెంచుకోవాలి.

- డాక్టర్ ఇందిర, సూపరింటెండెంట్, మహబూబ్‌నగర్ జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి

ఇంటర్వ్యూ..

ఉపాధి హామీ పథకం పనులకు గ్రామాల్లో యాక్షన్ ప్లాన్

- నాగరాజు యాదవ్, ఏపీవో



కోడేరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా గ్రామాల్లో కూలీలకు పని కల్పించే విధంగా 2026-27 సంవత్సరానికి గాను భవిష్యత్తు ప్రణాళిక తయారు చేస్తున్నామని ఏపీవో నాగరాజు యాదవ్ ఆంధ్రజ్యోతికి తెలిపారు.

యాక్షన్ ప్లాన్ ఏ విధంగా తయారు చేస్తున్నారు?

గ్రామాల్లో ప్రతీ కూలీకి 100 రోజుల పని కల్పించాలన్న ప్రభుత్వ ఉద్దేశానికి అనుగుణంగా భవష్యత్తు ప్రణాళిక యాక్షన్ ప్లాన్ తయారు చేస్తాం.

యాక్షన్ ప్లాన్‌లో ఏఏ పనులు గుర్తిస్తున్నారు?

గ్రామంలో మొదట దండోరా వేసి రైతులు కూలీల ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ ఆవరణలో రైతులకు సంబంధించిన బీడు భూముల అభివృద్ధి, పండ్ల తోటల పెంపకం తదితర పనులను గుర్తిస్తున్నాం.

రైతుల భూముల్లో ఏఏ పనులు ఎక్కువగా గుర్తిస్తున్నారు?

రైతుల పొలాల్లో భూమి చదును చేయడం, వాలు కట్టలను నిర్మించడం, ఫామ్ పాండ్లు వేయడం, కంప చెట్లు తొలగించడం తదితర పనులతో పాటు తోటల పెంపకం, జామ, మామిడి, సపోట తదితర చెట్లను పెంచడం రైతులకు, పశువుల పాక నిర్మించుకోవడానికి ప్రభుత్వం అనుమతి ఇచ్చారు .

గత సంవత్సరం నాటిన మొక్కల సంరక్షణ ఎలా ఉంది ?

గత సంవత్సరం మండలంలో 58వేల మొక్కలు నాటాం. వాటి సంరక్షణ ఈజీఎస్ కూలీల ద్వారా గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో బాధ్యత చూస్తున్నాం.

న్యూస్ బాక్స్

'మోసగించిన వారిపై చర్యలు తీసుకోవాలి'

బిజినేపల్లి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ పట్టణంలోని ఏరియా ఆసుపత్రిలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగాలు ఇప్పిస్తామని మోసగించిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని బాధితులైన భార్యాభర్తలు సామ సాహితి, రవిచంద్రన్ మంగళవారం కోరారు. బాధితులు తెలిపిన వివరాల మేరకు అవుట్ సోర్సింగ్ ఉద్యోగాల నియామకం చేపట్టే ఓ ఏజెన్సీని రెండేళ్లుగా ఎమ్మెల్యే డాక్టర్ రాజేశ్‌రెడ్డి, ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోదర్‌రెడ్డిల రెకమండేషన్ లెటర్లతో కలువగా వారు ఏరియా ఆసుపత్రిలో ఉద్యోగాలు ఉన్నాయని నమ్మించి సెక్యూరిటీ గార్డు డ్రెస్సులు అందజేశారని తెలిపారు. వాటిని ధరించి ఒక పూట డ్యూటీ చేయించి ఇంటికి వెళ్లమని నమ్మబలికారని, మరుసటి రోజు ఏజెన్సీ సూపర్‌వైజర్ నాగరాజును సంప్రదిస్తే డబ్బులు ఇవ్వకుండా ఉద్యోగాలు ఉండవని, అక్కడి నుంచి సెక్యూరిటీ గార్డుతో బయటకు తోసివేశారని పేర్కొన్నారు. చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కోరారు.

కల్వకుర్తి పట్టణ అభివృద్ధే లక్ష్యం

- మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్‌కుమార్



హైమాస్టు లైట్లను ప్రారంభిస్తున్న మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్‌కుమార్

కల్వకుర్తి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : కల్వకుర్తి పట్టణాభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్ కుమార్ తెలిపారు. కల్వకుర్తి పట్టణం సుభాష్ నగర్‌లోని వేంకటేశ్వరస్వామి దేవాలయం ముందు ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో ఏర్పాటు చేసిన హైమాస్టు లైట్లను ఆయన ప్రారంభించారు. ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో పట్టణంలో ప్రజలకు మౌలిక వసతులు కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ పసుల రమాకాంత్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ షానవాజ్ ఖాన్, నాయకులు సంతుయాదవ్, రాంరెడ్డి, జగన్, ఆలయ నిర్వాహకులు కల్వ మనోహర్, కల్వ హరికృష్ణ పాల్గొన్నారు.

అనారోగ్యంతో విలేకరి మృతి

వెల్దండ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లింగారెడ్డిపల్లి గ్రామానికి చెందిన మల్లెపాకుల సోమయ్య (45) విలేకరి మంగళవారం అనారోగ్యంతో మృతి చెందాడు. ఓ దినపత్రికలో పనిచేస్తున్న సోమయ్య అస్వస్థతకు గురికావడంతో హైదరాబాద్‌లోని ఆస్పత్రిలో చికిత్స నిమిత్తం తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. సోమయ్య మృతిపట్ల మండల ప్రెస్‌క్లబ్ సంతాపం ప్రకటించింది.

సిర్సవాడలో రెవెన్యూ సదస్సు

తాడూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : చాలా రోజులుగా పెండింగ్‌లో ఉన్న భూ సమస్యల పరిష్కారం కోసమే ప్రభుత్వం భూ భారతిలో భాగంగా రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నదని తహసీల్దార్ జయంతి తెలిపారు. మంగళవారం మండలంలోని సిర్సవాడ గ్రామంలో రెవెన్యూ సదస్సును ఏర్పాటు చేసి దాదాపు 50 దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఆర్‌ఐలు సల్మాన్, సురేష్, జీపీవోలు, రైతులు పాల్గొన్నారు.

భారత తొలి విద్యాశాఖ మంత్రికి ఘన నివాళి

- పలు చోట్ల మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి



కొల్లాపూర్‌లో ఆజాద్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మునిసిపల్ కమిషనర్ చంద్రశేఖర్‌రావు

కొల్లాపూర్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : కొల్లాపూర్ మునిసిపల్ కార్యాలయంలో భారత రత్న, భారత తొలి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి మునిసిపల్ కమిషనర్ చంద్రశేఖర్‌రావు, మాజీ మునిసిపల్ కౌన్సిలర్లు షేక్ రహీంపాషా, మునిసిపల్ సిబ్బంది నివాళులర్పించారు. ఈ సందర్భంగా మునిసిపల్ కమిషనర్ చంద్రశేఖర్‌రావు, మాజీ మునిసిపల్ కౌన్సిలర్లు షేక్‌రహీంపాషా, ఎండీ నయీంలు మాట్లాడుతూ భారతదేశ తొలి విద్యాశాఖ మంత్రి స్వాతంత్ర్య సమరయోధుడు, మత సామరస్యానికి ప్రతీక అయిన మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని జాతీయ విద్యా దినోత్సవంగా జరుపుకుంటున్నారని పేర్కొన్నారు.

కొల్లాపూర్‌లో పీజీ సెంటర్ (పీయూ అనుబంధం)లో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మార్క్ పోలోని యస్ ఆధ్వర్యంలో మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి నిర్వహించారు.

ఆవాజ్ జిల్లా కన్వీనర్ ఎండీ సలీం, మండల నాయకులు మునీర్, మక్బూల్, చాంద్‌పాషా, బాలస్వామి ఆధ్వర్యంలో మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి వే డుకలను ఎన్టీఆర్ చౌరస్తాలో నిర్వహించారు.

కల్వకుర్తి పట్టణంలోని మైనార్టీ గురుకులంలో బాలికల జూనియర్ కళాశాల, పాఠశాలలో అబుల్ కలాంఆజాద్ జయంతిని పురస్కరించుకుని జాతీయ విద్యా దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి కల్వకుర్తి మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్‌కుమార్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు పసుల రమాకాం త్‌రెడ్డి, మసూద్, ప్రిన్సిపాల్ చంద్రకళ, కిరణ్మయి, నాయకులు పాల్గొన్నారు. అదేవిధంగా కల్వకుర్తి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలతో పాటు పలు కార్యాలయాల్లో అబుల్ కలాం ఆజాద్ జయంతిని నిర్వహించారు.

కల్వకుర్తి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ శర్వాణి ఆధ్వర్యంలో మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.

ఉప్పునుంతలలోని బాలుర ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడు వెంకటేష్ ఆధ్వర్యంలో మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి జరుపుకున్నారు.

ఊర్కొండ మండలం ఊర్కొండపేటలోని అబుల్‌కలాం ఆజాద్ జయంతిని ముస్లిం యువకులు ఘనంగా నిర్వహించారు. ఎన్ఎస్‌యూఐ మండల అధ్యక్షుడు ఎండీ కైసర్, కాంగ్రెస్ యువజన విభాగం అసెంబ్లీ కార్యదర్శి మూసుం నాయకులు షాకేర్, చోటు, జహంగీర్ ఉన్నారు.

విద్యాభివృద్ధికి ప్రభుత్వం నిరంతరం కృషి

- జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేందర్



మాట్లాడుతున్న జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేందర్

అచ్చంపేటటౌన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : విద్యాభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేందర్ అన్నారు. మైనార్టీ సంక్షేమ దినోత్సవం పురస్కరించుకొని మంగళవారం పట్టణంలోని మైనార్టీ పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం మైనారిటీ సంక్షేమానికి కట్టుబడి ఉందని అన్నారు. విద్యార్థులు, మౌలానా అబుల్ కలాం ఆజాద్‌ను స్ఫూర్తిగా తీసుకొని కష్టపడి చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. అనంతరం వ్యాసరచన పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు మల్లేష్, దర్గా కమిటీ చైర్మన్ రఫీ, నాయకులు సదాబ్ సిద్దిక్, ప్రిన్సిపాల్ యాదగిరి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలి'

కొల్లాపూర్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : కనీస వేతనం రూ26వేలు ఇస్తూ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కొల్లాపూర్‌లోని నూతన గ్రంథాలయం భవనంలో సీఐటీయూ కొల్లాపూర్ మండల మహాసభ నిర్వహించారు. ఈ మహాసభకు సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శివవర్మ అధ్యక్షత వహించారు. శ్రీనివాస్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల హక్కులను కాలరాస్తూ పని గంటల దినాన్ని పెంచుతూ కార్మికుల జీవితాలతో చెలగాటం ఆడడం సరి కాదన్నారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కనీస వేతనాల చట్టాలను అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు మధు, మల్లేష్, వెంకటరమణ, నీరజమ్మ, శ్రీదేవి, హుస్సేనమ్మ, వెంకటస్వామి, గోపాల్, శివశంకర్, సత్యనారాయణరెడ్డి, సుజాత, గౌరమ్మ, రజిత, సుగుణ, లక్ష్మీ పాల్గొన్నారు.

తండాల్లో అధికారుల సర్వే షురూ

అచ్చంపేట రూరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలో ఇటీవల కురిసిన మొంథా తుఫాన్ కారణంగా ముంపునకు గురైన మర్లపాడు, కేశ్యతండాల్లో సోమవారం నుంచి సర్వే ప్రారంభమైంది. స్థానిక ఎమ్మెల్యే వంశీకృష్ణ సూచన, కలెక్టర్ బదావత్ సంతోష్ ఆదేశాలతో అచ్చంపేట తహసీల్దార్ సైదులు ఆధ్వర్యంలో సోమ, మంగళవారాల్లో పరిశీలన, సర్వే పనులు సిబ్బంది ప్రారంభించారు. కేశ్య తండాలో మొత్తం 89 కుటుంబాలు ఉన్నాయని, వారం పది రోజుల్లో సర్వే పూర్తి చేస్తామని తహసీల్దార్ అన్నారు. మర్లపాడుతండాలో బురద ఎక్కువగా ఉందని, రెండు మూడు రోజుల్లో అక్కడ సర్వే పనులు చేపడుతామన్నారు. ఈ సర్వే పనుల్లో ఇరిగేషన్, ఆర్‌అండ్‌బీ, హార్టికల్చర్, రెవెన్యూ, అటవీ శాఖల అధికారులు పాల్గొంటున్నారన్నారు.

సబ్సిడీపై మామిడి కవర్లు

పెద్దకొత్తపల్లి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ ప్రభుత్వం ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ ద్వారా 50శాతం సబ్సిడీపై అందించే మామిడి కవర్లను ఇస్తున్నదని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని హార్టికల్చర్ కొల్లాపూర్ డివిజన్ అధికారి ఎం.లక్ష్మణ్ తెలిపారు. కాయ, నిమ్మకాయ సైజులో ఉన్నప్పుడు ఈ కవర్లను తొడగడం ద్వారా కాయ నాణ్యత, సైజు పెరగడంతో పాటు కాయ అధికరంగు కలిగి ఉండడం ద్వారా మార్కెట్‌లో సాధారణ ధర కంటే కొంత మేరకు అధిక ధర పలికే అవకాశం ఉందని లక్ష్మణ్ పేర్కొన్నారు. దరఖాస్తులను చివరి తేదీ ఈ నెల 15న అని ఆయన పేర్కొన్నారు.

మార్కెట్ కమిటీ చైర్మన్‌కు సన్మానం

పెద్దకొత్తపల్లి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : మార్కెట్ కమిటీ చైర్మన్ దండు నరసింహను తన నివాసంలో మంగళవారం అగ్నిపథ్ ఆర్మీ ర్యాలీ నిర్వాహకులు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈనెల 5న పెద్దకొత్తపల్లిలో నిర్వహించిన ర్యాలీకి సహకరించినందుకు కృతజ్ఞతగా సన్మానించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజర్లు పొనమోని బ్రదర్స్ లింగం, లాలు, శంకర్, వాసు, కాంగ్రెస్ నాయకులు మైను, కుర్మయ్య, బ్యాగరీ మల్లేష్, లింగస్వామి, లాలు, లింగస్వామి పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

అమ్రాబాద్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : అమ్రాబాద్ మండల పరిధిలోని మాధవానిపల్లి గ్రామానికి చెందిన శవ్వ బొడ్డెమ్మ అనే మహిళ అనారోగ్యంతో మృతి చెందిన విషయాన్ని తెలుసుకుని సీబీఎం ట్రస్టు చైర్మన్ అమ్రాబాద్ మాజీ జడ్పీటీసీ డాక్టర్ అనురాధ మాధవానిపల్లి చేరుకుని మంగళవారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. ఆమె వెంట కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

శిబిరాన్ని సద్వినియోగపర్చుకోవాలి

లింగాల, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : కంటి సమస్యతో బాధపడే వారు కంటి పొరశస్త్ర చికిత్స శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని శిబిరం ఇన్‌చార్జి గోవర్ధన్‌రెడ్డి కోరారు. వివిధ సంస్థల ఆధ్వర్యంలో లింగాల హైస్కూల్ ప్రాంగణంలో కంటి పొర శస్త్ర చికిత్స శిబిరం కొనసాగుతోందని తెలిపారు. మూడవ రోజు మంగళవారం 141 మందిని పరీక్షించినట్లు తెలిపారు. కార్యక్రమంలో గోవర్ధన్‌రెడ్డి, శంకర నేత్రాలయం కో ఆర్డినేటర్ రాజు, రేణయ్య పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

వంగూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : మండలం కేంద్రంలో కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా మంగళవారం ప్రజలకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్ఐ మహేష్‌గౌడ్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

లంబాడీల ఐక్యవేదిక ఇన్‌చార్జిగా శ్రీను నాయక్

బిజినేపల్లి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చిన్నపీరుతండాకు చెందిన వడ్యావత్ శ్రీనునాయక్‌ను లంబాడీల ఐక్యవేదిక నాగర్‌కర్నూల్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జిగా నియామకం అయినందున మండలంలోని గిరిజన నాయకులు హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రాజ్‌కుమార్ నాయక్, రాష్ట్ర కోఆర్డినేటర్ గుగులోత్ రమేష్ నాయక్‌లు నియమించారు.

విద్యార్థినికి అభినందనలు

పెంట్లవెల్లి నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : సంధీశ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గత ఆదివారం నిర్వహించిన గణితం టాలెంట్ టెస్టు పరీక్షలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థిని ద్యారంగుల వైష్ణవిని ఎస్ఐ సువర్ణ శాలువాతో ఘనంగా సత్కరించారు. జిల్లాలోనే మొదటి స్థానంలో నిలిచిన కస్తూర్బా పాఠశాల విద్యార్థినిని ఉపాధ్యాయునులతో పాటు మంగళవారం సత్కరించారు. వైష్ణవిని ఆదర్శంగా తీసుకొని కస్తూర్బా పాఠశాలలోని మిగతా విద్యార్థినులు చదువులో రాణించాలని సూచించారు. కార్యక్రమంలో వాల్మీకి సంఘం నియోజకవర్గ ఉపాధ్యక్షుడు డిష్ శేఖర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శిర్సనగండ్ల ఆలయ అభివృద్ధి పనుల పరిశీలన

చారకొండ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని శిర్సనగండ్ల సీతారామచంద్ర స్వామి ఆలయాన్ని బుధవారం తెలంగాణ టూరిజం డీఈ పర్వవేదిగౌడ్, ఏఈ నాగార్జున గౌడ్, శ్రీవెన్ కన్సల్టెంట్ ఆర్కిటెక్చర్ రమణారావు, మహేష్ ఆలయాన్ని సందర్శించి పరిసరాలను పరిశీలించారు. డీఈ పర్వవేదిగౌడ్ మాట్లాడుతూ రాష్ట్ర టూరిజం శాఖ నుంచి సీతారామచంద్రస్వామి ఆలయ అభివృద్ధికి రూ. 2 కోట్లు మంజూరు అయ్యాయని అన్నారు ఆలయ ఆవరణలోని సంతోష్ భవనంలో ఉన్న 18 గదులకు మరమ్మతులు, దేవాలయం దిగువన 12 శాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణాలతో పాటు ఆలయ ఆవరణలో ఉన్న కోనేరును అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ డేరం రామశర్మ, ఈవో ఆంజనేయులు, మేనేజర్ నిరంజన్, మాజీ ఎంపీటీసీ నర్సింహారెడ్డి, కాంగ్రెస్ మండల నాయకుడు కళ్ల సురేందర్‌రెడ్డి, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

ఎంఈవో, హెచ్‌ఎంలపై కఠిన చర్యలు తీసుకోవాలి : బీఎస్పీ

నాగర్‌కర్నూల్ టౌన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : పాఠ్యపుస్తకాలను తరలించేందుకు విద్యార్థులను తీసుకువచ్చి రోడ్డు ప్రమాదానికి కారకులైన పెద్దకొత్తపల్లి ఎంఈవో, జడ్పీహెచ్ సాతాపూర్ హెచ్‌ఎంలపై కఠిన చర్యలు తీసుకోవాలని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు బోనాసి రాంచందర్ డిమాండ్ చేశారు. మంగళవారం బీఎస్పీ ఆధ్వర్యంలో జిల్లా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులను పరామర్శించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆదేశాల మేరకే అటెండర్‌తో కలిసి పాఠ్యపుస్తకాలు ఆటోలోకి ఎత్తేందుకు తీసుకువచ్చి విద్యార్థులతో హమాలీ పని చేయించారని ఆరోపించారు. కార్యక్రమంలో బీఎస్పీ జిల్లా నాయకులు పృథ్వీరాజ్, కళ్యాణ్, హర్ష ముదిరాజ్, కురుమయ్య. రామకృష్ణ, నాగరాజు పాల్గొన్నారు.

పలువురు నాయకుల పరామర్శ

జిల్లా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులను సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్ఎండీ ఫయాజ్, సీపీఎం జిల్లా నాయకుడు పొదిల రామయ్య, బీజేపీ, ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు వేర్వేరుగా పరామర్శించారు.

ప్రమాదవశాత్తు కాల్వలో పడి వ్యక్తి మృతి

నాగర్‌కర్నూల్‌క్రైం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : ప్రమాదవశాత్తుగా గొల్లోల వాగులో పడి సుప్పరి పర్వతాలు(37) మృతి చెందినట్లు ఎస్ఐ గోవర్ధన్ మంగళవారం తెలిపారు. వివరాల ప్రకారం... నాగర్‌కర్నూల్ మునిసిపాలిటీ పరిధిలోని నాగనూల్‌కు చెందిన సుప్పరి పర్వతాలు అదేగ్రామానికి చెందిన చిన్నోళ్ల పర్వతాలు దగ్గర వ్యవసాయ పని నిమిత్తం పాలేరు (గాసం) కుదిరి పని చేస్తున్నాడు. మంగళవారం రోజు మాదిరిగానే వ్యవసాయ పని నిమిత్తం పొలం దగ్గరికి వెళ్లి ప్రమాదవశాత్తు గొల్లోల వాగులో పడి మృతి చెందాడు. ఈ సంఘటనపై మృతుని అన్న సొప్పరి రాములు తన తమ్ముడి మృతిపై ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద చెత్త వేయరాదు

- ప్రజాబాటలో విద్యుత్ ఉద్యోగులు



మన్ననూరులో చెత్తను తొలగిస్తున్న ఉద్యోగులు

మన్ననూర్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలు పడే యడం వలన విద్యుత్తు ప్రమాదాలు జరిగేఆస్కారముందని ట్రాన్స్‌కో ఏఈ రమేష్ నాయక్ తెలిపారు. అమ్రాబాద్ మండలం మన్ననూరు గ్రామంలో విద్యుత్తు ఉద్యోగులు మంగళవారం పల్లెబాట కార్యక్రమం నిర్వహించారు. ఉమామహేశ్వర గిరిజనతండా, మన్ననూరులోని విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్ పరిసరాల్లో ఉన్న చెత్తాచెదారం, కాగితాలు, ప్లాస్టిక్ వ్యర్థాలను శ్రమదానం ద్వారా తొలగించారు. గ్రామంలోని విద్యుత్తు స్తంభాల వద్ద ఎక్కడైనా కేబుల్ లైన్ల సమస్య ఉంటే తమ దృష్టికి తీసుకువస్తే, ఆగ్రామంలో పల్లెబాట నిర్వహించి విద్యుత్తు సమస్యలను పరిష్కరిస్తా మన్నారు. వారంలో 3 రోజులు పల్లెబాట ద్వారా గ్రామాల్లోని విద్యుత్తు సమస్యల పరిష్కారానికి ట్రాన్స్‌కో చర్యలు తీసుకుంటుందని వివరించారు. కార్యక్రమంలో విద్యుత్తు లైన్‌ఇన్‌స్పెక్టర్ జహీర్, కట్టర్ నిరంజన్ పాల్గొన్నారు.

● వెల్దండ : మండలంలోని పెద్దాపూర్ గ్రామంలో విద్యుత్‌శాఖ ఏఈ వెంకటేష్ ఆధ్వర్యంలో అధికారులు ప్రజాబాట నిర్వహించారు. గ్రామంలో నెలకొన్న విద్యుత్ సమస్యలను స్థానికులను అడిగి తెలుసుకున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద పిచ్చిమొక్కలను తొలగించి, శుభ్రం చేశారు. లైన్‌మన్లు లక్ష్మణ్‌నాయక్, లష్కర్, జేఎల్‌ఎం రామకృష్ణ, సిబ్బంది లింగారెడ్డి ఉన్నారు.

● ఊర్కొండ మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ శాఖ అధికారులు జనంబాటలో భాగంగా మండల కేంద్రంలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్స్, విద్యుత్ తీగల కింద ఉన్న ముళ్లపొదలను తొలగించారు. పరిసరాలను శుభ్రంగా ఉంచాలని సూచించారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఏఈ సాయన్నగౌడ్, లైన్‌మన్ విజేందర్, సిబ్బంది రాము ఉన్నారు.

క్రీడలతో శారీరక, మానసిక ఆరోగ్యం

- కలెక్టర్ బదావత్ సంతోష్



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న కలెక్టర్ సంతోష్

కల్వకుర్తి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : క్రీడల్లో గెలుపోటములు సహజమని, క్రీడాకారులు స్నేహపూర్వకంగా క్రీడల్లో పాల్గొనాలని, క్రీడలతో శారీరక, మానసిక ఆరోగ్యం చేకూరుతుందని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్, ఉమ్మడి నల్గొండ జిల్లాల తెలంగాణ గిరిజన ఆశ్రమ, గిరిజన సంక్షేమ వసతిగృహాలు, గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలో 6వ గిరిజన జోనల్ స్థాయి క్రీడలను గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల కల్వకుర్తి వేదికగా మంగళవారం అట్టహాసంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై జ్యోతిప్రజ్వలన చేసి పోటీలను ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రతీ విద్యార్థి రోజువారి జీవితంలో క్రీడలకు ప్రాధాన్యతనివ్వాలని, క్రీడలు కేవలం పోటీల్లో గెలవడం లేదా బహుమతులు అందుకోవడం కోసం కాకుండా జీవితంలో క్రమశిక్షణతో ముందుకు సాగేందుకు ప్రేరణగా ఉండాలని సూచించారు. క్రీడల్లో ఓటమిని ఒక పాఠంగా తీసుకుని మరింత సాధన చేసి విజయాన్ని సాధించాలనే లక్ష్యంతో ముందుకు సాగాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి ఫిరంగి, తహసీల్దార్ ఇబ్రహీం, పాఠశాల ప్రిన్సిపాల్ వివిధ పాఠశాలల ప్రిన్సిపాల్స్, పీఈటీలు, క్రీడాకారులు, పేరెంట్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పత్తి కొనుగోలులో నిబంధనలు సడలించాలి

- విలేకరుల సమావేశంలో పలువురు రైతుల డిమాండ్



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న రైతులు

కల్వకుర్తి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : పత్తి కొనుగోళ్లలో సీసీఐ అవలంభిస్తున్న నిబంధనలను సడలించి మొత్తం మిల్లుల్లో సీసీఐ కొనుగోలు జరిగే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని పత్తి మిల్లు యజమానులు నాగుల వెంకటేశ్వర్లు, రఘు, పలువురు రైతులు డిమాండ్ చేశారు. మంగళవారం కల్వకుర్తి మండల పరిధిలోని కాటన్ మిల్లు సమీపంలోని తిరుమల జిన్నింగ్ మిల్లులో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. ఏ మిల్లులోనైనా పత్తిని దూది గింజలుగా వేరు చేసేందుకు సీసీఐ చెల్లిస్తున్న మొత్తం ఒక బేల్‌కు రూ.1440అని ఇదే ధరతో అన్ని మిల్లుల్లో మిల్లింగ్ చేస్తున్నప్పుడు ఎల్-1, ఎల్-2, ఎల్-3 అంటూ విభజన ఎందుకని వారు ప్రశ్నించారు. ఎకరాకు 7క్వింటాళ్ల పత్తిని మాత్రమే కొనుగోలు చేయాలనే నిర్ణయాన్ని విరమించుకోవాలని కోరారు. పత్తిలో తేమ శాతం 8 నుంచి 12శాతం కంటే ఎక్కువ ఉంటే కొనాలని సీసీఐ స్పష్టం చేయడం రైతులను ఇబ్బందుల్లోకి నెట్టడమే అన్నారు. కపాస్ కిసాన్ యాప్‌తో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గ్రామీణ రైతుల్లో చాలా మందికి స్మార్ట్ ఫోన్లు లేవని పేర్కొన్నారు. పత్తి మిల్లు యజమానులు, రైతులు పాల్గొన్నారు.

వరి రైతులు మద్దతు ధరతో పాటు బోనస్ పొందాలి



వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఐకేపీ సీసీ శేషన్నగౌడ్

కోడేరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : రైతులు తాము పండించిన వరిని ప్రభుత్వం ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి మద్దతు ధరతో పాటు రూ. 500 బోనస్ పొందాలని ఐకేపీ సీసీ శేషన్నగౌడ్ తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని తీగలపల్లి గ్రామంలో వరి కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. పంటవిక్రయించే సందర్భంలో దళారుల చేతిలో మోస పోవద్దని, ప్రభుత్వం ఏ గ్రేడ్ ధాన్యానికి రూ. 2389, బీ గ్రేడ్ ధాన్యానికి రూ. 2369 చెల్లిస్తుం దని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సంఘం అధ్యక్షులు పార్వతమ్మ, కార్యదర్శి నీరజ, బుక్ కీపర్ కురుమూర్తి, గ్రామ నాయకులు బాల్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభం

కోడేరు, (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించామని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోడేరు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సీఈవో ప్రకాష్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మండల కేంద్రంలోని సింగిల్‌విండో గోదాం ఆవరణలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ప్రభుత్వం ప్రకటించిన క్వింటాల్‌కు రూ. 2400 మద్దతు ధర ప్రకటించిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఈవోతో పాటు సింగిల్‌విండో సిబ్బంది ఖాజా, మహేష్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీశైలం వైపు సూచిక బోర్డు ఏర్పాటు



శ్రీశైలం రూటును తెలిపే సూచిక బోర్డును ఏర్పాటు చేసిన సింగిల్ విండో వైస్ చైర్మన్ యాదయ్య

తెలకపల్లి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ చౌరస్తా సమీప కూడలిలో మంగళవారం శ్రీశైలం రూటును తెలిపే సూచిక బోర్డును ఏర్పాటు చేశారు. చాలామంది భక్తుల కూడలిలో దారితప్పి కల్వకుర్తి వైపు కిలోమీటర్ల కొద్దీ వెళ్లి తమ దారి తెలుసుకొని తిరిగి వస్తూ ప్రయాణించి శ్రీశైలం వెళ్తున్నారు. ఈ సమస్యను తెలుకొని మామిళ్లపల్లి యాదయ్య, బ్రదర్స్ క్రాంతి హోటల్ సౌజన్యంతో శ్రీశైలం సూచిక బోర్డును ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎండీ ఫరీద్, బాలస్వా మి విష్ణు, శ్రీరాములు, శివ పాల్గొన్నారు.

ఢిల్లీ ఘటనకు అమిత్‌షా నైతిక బాధ్యత వహించాలి

- సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్ఎండీ ఫయాజ్



తీవ్రవాద దిష్టిబొమ్మను దహనం చేస్తున్న సీపీఐ నాయకులు

కందనూలు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : దేశ రాజధాని ఢిల్లీలో జరిగిన ఉగ్రదాడి ఓ పిరికి పంద చర్య అని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్ఎండీ ఫయాజ్ ఆరోపించారు. సీపీఐ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద తీవ్ర వా ద దిష్టిబొమ్మను మంగళవారం దహ నం చేశారు. ఈ సందర్భంగా సీపీఐ శ్రేణులు తీవ్రవాదం నశించాలి, ప్రపంచ శాంతి వర్ధిల్లాలి అంటూ నినాదాలు చేశారు. ఫయాజ్ మాట్లాడు తూ కొన్నేళ్లుగా దేశంలో తీవ్రవాదుల దాడులు పెరిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మతం పేరుతో, దేశం పేరుతో కొంత మంది మూర్ఖులు చేస్తున్న నరమేధానికి సరైన సమాధానం భారత ప్రజలు ఐక్యతతో జవాబు చెపాలని ఆయన పిలుపునిచ్చారు. ఢిల్లీలో జరిగిన ఉగ్రదాడులకు నైతిక బాధ్యత వహించి కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా తక్షణమే రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. దేశం నడిబొడ్డున బాంబుపేలుళ్లు మన దేశ రక్షణకు పెద్ద సవాల్‌గా మారిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సమితి సభ్యులు మారేడు శివశంకర్, కృష్ణాజీ, టి.కిరణ్‌కుమార్, ఎండీ కుతుబ్దీన్, నాయకులు మధు గౌడ్, ఈర్ల భూపేష్, సీపీఐ పట్టణ సహాయ కార్యదర్శి కొత్త రామస్వామి, కల్వకోల్ శాఖ కార్యదర్శి సంఘమోని కృష్ణ, సంగం కుమార్, సి.శేఖర్, తక్షణమూర్తి, శేఖర్, జి.శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

- సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు

వెల్దండ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వ భాగస్వామ్యంతో పనిచేస్తున్న స్కీం వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు కోరారు. మంగళవారం మండల కేంద్రంలో సీఐటీయూ అనుబంధ సంస్థలైన అంగన్‌వాడీ, ఆశావర్కర్లు, మధ్యాహ్న భోజనం, గ్రామ పంచాయతీ వర్కర్లకు నిర్వహించిన విస్తృతస్థాయి సమావేశంలో ఆంజనేయులు పాల్గొని మాట్లాడారు. స్కీము వర్కర్ల న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలని, కనీస వేతనాలు ఇవ్వాలని, ఉద్యోగులుగా గుర్తించి వారికి పీఎఫ్, ఈఎస్ఐ వంటి సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈనెల 30న జిల్లా కేంద్రంలో సీఐటీయూ జిల్లా మహాసభలు, డిసెంబరు 5, 6, 7 తేదీలలో మెదక్‌లో నిర్వహించే రాష్ట్ర మహాసభలకు అధిక సంఖ్యలో తరలిరావాలని కో రారు. సీఐటీయూ మండల కమిటీ అధ్యక్షురాలిగా మాసమ్మతోపాటు కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. సమావేశంలో అంగన్‌వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు మాసమ్మ, స్వప్న, యాదమ్మ, జాహెదా, స్వరూప, వినోద్, యాదయ్య, చంద్రశేఖర్, రాంచంద్రయ్య ఉన్నారు.